వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


వైజాగ్ మీడియా ట్రైనింగ్ సెంటర్
ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో రిపోర్టింగ్- డిటిపి- ప్రింటింగ్- వీడియో ఫిల్మింగ్- సబ్ ఎడిటింగ్- మార్కెటింగ్- అడ్వర్టైజింగ్‌లలో ఉచిత శిక్షణ కొరకు సంప్రదించండి.
9393949345



RNI No.52722/90 సంపుటి: 33 సంచిక : 66 విశాఖపట్నం, 16 డిశెంబరు 2022 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ఓటరు నమోదుపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కలెక్టర్లతో సమీక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. గురువారం విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు , జాయింట్ కలెక్టర్లతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని అన్నారు . ఓటరు జాబితాలో పేర్లు తొలగింపు ప్రక్రియ వివాద రహితంగా నిర్వహించాలని , నిబంధనలను పకడ్బందీగా పాటిస్తూ క్షేత్రస్థాయి విచారణ తర్వాత మరణించిన వారిని, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు , రెండు సార్లు నమోదు కాబడిన వాటిని గుర్తించి ఒక పేరును జాబితా నుంచి తొలగించాలని ఆయన సూచించారు.

**ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి**

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో బాగంగా వచ్చిన దరఖాస్తులలో పెండింగ్ ఉన్నవాటిని అర్హతలు సత్వరమే పరిశీలించాలని, డూప్లికెట్స్ క్షున్నంగా పరిశీలించి తొలగించాలన్నారు.

ఈ సందర్భంగా విశాఖ జిల్లా కు సంబంధించి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ-2023, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు వివరాలు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో డూప్లికేట్ ,అనర్హత దరఖాస్తులు అధికంగా ఉన్నాయని ,పరిశీలించి తొలగిస్తామని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ,జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి , ఈఆర్వోలు , ఏఈఆర్వోలు ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతలో రాజీ పడొద్దు.. సీఎం కీలక ఆదేశాలు



**అమరావతి:** మహిళా శిశు సంక్షేమ శాఖపై తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని సీఎం అధికారులు వివరించారు. అంగన్‌వాడీలలో ఖాళీగా ఉన్న సీడీపీఓ పోస్టుల వివరాలను సీఎంకు అందించారు. ఖాళీగా ఉన్న సీడీపీఓ పోస్టుల భర్తీకి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 61 సీడీపీఓ పోస్టుల భర్తీకి సీఎం ఆమోదం తెలిపారు. వాటి నియామకాలు ఎపీపీఎస్సీ ద్వారా చేపట్టనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

సీడీపీఓ పోస్టుల భర్తీని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. వాటితో పాటు ఇంకా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. అంగన్‌వాడీలలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. నాడు-నేడు కింద చేపడుతున్న పనులను వేగవంతం చేయాలన్న సీఎం.. సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు, పిల్లలు వికాసం చెందేలా మంచి వాతావరణాన్ని కల్పించడం ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.

అంగన్‌వాడీలలో సార్టెక్స్ రైస్ సరఫరా చేయాలి. న్యూట్రిషన్ కిట్ సరఫరాలో నాణ్యత విషయంలో అస్సలు రాజీ పడొద్దు. పిల్లలకు ఇచ్చే న్యూట్రిషన్ కిట్ నాణ్యత కచ్చితంగా అత్యున్నత ప్రమాణాలతో ఉండాలి. అంగన్‌వాడీలలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలలో అన్నింటా క్వాలిటీ పెరగాలి. ఆ ఫలితాలు కనబడాలి. గతంలో కన్నా పిల్లలకు మంచి చేస్తున్నామన్న సంతృప్తి కలగాలి. అందుకోసం కావాల్సిన వసతులు, సదుపాయాలు పూర్తిగా కల్పించాలి. అంగన్‌వాడీల్లో కరికులమ్ (బోధనాంశం) కూడా మారాలి. ఎందుకంటే పిల్లలకు చిన్న వయసులోనే మెదడు తొందరగా పరిణతి చెందుతుంది. ఏ విషయాన్ని అయినా త్వరగా గ్రహించగలుగుతారు. ఇంకా వారికి మంచి అవగాహన కూడా ఏర్పడుతుంది. కరికులమ్ మార్పు కోసం అవసరం అయితే ప్రత్యేక అధికారిని నియమించాలి.

కొత్తగా అందుబాటులోకి వచ్చిన సూపర్ వైజర్ల సహాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలన్న సీఎం. తనిఖీలు, నాణ్యత, నాడు-నేడు ఈ మూడు అంశాలకు సంబంధించి కచ్చితమైన మార్పు కనిపించాలన్న సీఎం. అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హెల్త్, హౌసింగ్, మహిళా శిశు సంక్షేమ శాఖలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వీటిలో మార్పుల కోసం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి. సిబ్బంది నియామకాలు సహా... ఏ రకమైన అవసరం ఉన్నా ప్రభుత్వం

(మిగతా 2లో)

## ఎమ్మెల్సీ మాధవ్‌కు అయ్యప్పస్వాముల కృతజ్ఞతలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎమ్మెల్సీ మాధవ్ జోక్యం తో అయ్యప్ప భక్తులు కు ప్రయాణ ఏర్పాట్లు చేసిన రైల్వే అధికారులు జెపి ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ జోక్యం తో స్వామి అయ్యప్ప భక్తులు కు రైల్వే బోగీలు ఏర్పాటు. విశాఖ నుండి అయ్యప్ప భక్తులు రైల్వే రిజర్వేషన్ చేయించుకున్నారు. అయితే అయ్యప్ప భక్తులు రిజర్వేషన్ చేయించుకున్న ట్రైన్ కి బోగీలు సంఖ్య తగ్గించడం తో రిజర్వేషన్ కన్ఫర్మ్ అయిన టిక్కెట్లు ఆర్ ఎసి గా మార్చడం తో అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ రైల్వే అధికారులు పై సీరియస్ అయ్యారు. రిజర్వేషన్ చేయించుకున్న అయ్యప్ప భక్తులు కు ప్రయాణ ఏర్పాట్లు చేయాలని మాధవ్ ఆదేశించారు. వెంటనే స్పందించి నా రైల్వే అధికారులు అయ్యప్ప భక్తులు కు భోజనం ఏర్పాటు చేసి యథావిధిగా ప్రయాణం ఏర్పాట్లు చేస్తున్నామని రైల్వే అధికారులు మాధవ్ కు మౌఖిక హామీ ఇచ్చారు.

## ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించండి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఖచ్చితమైన ఓటర్ జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. గురువారం అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ టు డోర్ సర్వే చేసి కొత్త ఓటర్లను గుర్తించాలని చెప్పారు. పి వి టి జి ఓటరుల నమోదుపై ప్రత్యేక దృష్టి సాధించాలని చెప్పారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 1లక్ష 35వేల 417 పివిటిజీ ఓటర్లు ఉన్నారని చెప్పారు.89 వేల ఓటర్లను సర్వే చేయడం జరిగిందన్నారు. డోర్ టు డోర్ సర్వేలో 16, 719

(మిగతా 2లో)

## టిడిఆర్ ఇష్యూలను త్వరతగతిన పరిష్కరించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జోన్-2 పరిధిలో టిడిఆర్ ఇష్యూలను త్వరతగతిన పరిష్కరించాలని జివిఎంసి కమిషనర్ పి రాజా బాబు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రెండవ జోన్ పరిధిలోని మధురవాడ, బక్కన్నపాలెం, నవోదయ జంక్షన్, రేవలపాలెం, కొమ్మాది, నగర పాలెం, వాంబే కాలనీ, ఎండాడ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మించేటప్పుడు ఎక్కడెక్కడ ఇబ్బందులు ఉన్నాయో అక్కడ అధికారులు చొరవ చూపి తగు చర్యలు తీసుకొని రోడ్డు వేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కోర్టు కేసులు, రెవెన్యూ సమస్యలు ఉన్నట్లయితే ఎంఎస్సీ, ఎమ్మార్వో లతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం అమలు చేస్తూ మధ్య మధ్య ఉన్న అడ్డంకులను పరిష్కరించి రోడ్లు వేయాలని ఆదేశించారు. నగరపాలెం రోడ్డు వైడినింగ్ కొరకు, 31 మందికి టీడీఆర్ సమస్యలు ఉన్నందున వారితో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేందుకు తగు చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణం చేయువిధంగా చూడాలని ఆదేశించారు. ఎండాడ రోడ్ వైడినింగ్ లో ఎవరైతే ముందుకు రాలేదో వారికి టీడీఆర్ గూర్చి అవగాహన కల్పించాలన్నారు. ఎండాడ చెరువు పూడికతో నిండి ఉందని అందులో పూడికలు తీయించాలని స్థానిక కార్పొరేటర్ లోడగల అప్పారావు కమిషనర్ దృష్టి తీసుకురాగా పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

ఈ పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారి సురేష్, డిసిపి పద్మజ, ఎసిపి శాస్త్రి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఏఎస్ఐపై యువతి దాడి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బుధవారం రాత్రి 11.30 సమయంలో ఒక మహిళ బీచ్‌రోడ్డులో స్కూటీపై కూర్చొని బీరు సేవిస్తోందని కంట్రోల్ రూమ్‌కు ఫోన్ వచ్చింది. బీచ్ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యనారాయణకు ఈ సందేశం పంపబడగా ఆయన రక్షక్ వాహనంలో ఆమెను వెతికేందుకు బయల్దేరారు. ఆమె వైఎంసీఏ జంక్షన్ వద్ద ఉండడం గమనించారు. అమూల్య అనే యువతి ఒక చేతిలో చేతిలో మరో చేతిలో మద్యం సీసాతో కనబడే సరికి ఆమెను ఏఎస్ఐ వారించి ఇంటికి వెళ్లిపొమని సలహా ఇవ్వగా అప్పటికే మద్యం ప్రభావంలో ఉన్న ఆ యువతి ఏఎస్ఐపై ఆగ్రహించి దాడికి తెగబడింది. మిగిలిన ప్రజలు చూస్తూ ఉండగానే ఆమె అతడి కళ్లద్దాలు నేలకేసి కొట్టి యూనిఫామ్ పట్టుకొని చినిగే వరకు లాగింది. పరిస్థితి అదుపులో లేదని గ్రహించిన ఏఎస్ఐ ఉన్నతాధికారులకు సందేశం పంపగా వెంటనే నైట్ రౌండ్ జోన్ అధికారి శ్రీనివాసరావు, మహిళా ఎస్ఐ లక్ష్మి, దిశ వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అమూల్యను బ్రీదింగ్ ఎనలైజర్‌తో పరీక్షించగా 148.1 ఎం.జి/100 ఎంఎల్ మద్యం ప్రభావం రికార్డైంది. నిందితురాల్ని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

## ముడసర్లోవలో వాకర్స్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించిన నగర మేయర్



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** ఆరోగ్య రీత్యా ప్రతి ఒక్కరూ రోజులో ఒక గంట పాటు శారీరిక శ్రమ చేయాలని అందుకు వాకింగ్ లేదా యోగ మార్గాన్ని ఎంచుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గురువారం రెండవ జోన్ 13 వ వార్డు పరిధి ముడసర్లోవ లోని స్కిల్ డెవలప్మెంట్ ప్రక్కన ముడసర్లోవలో వాకర్ అసోసియేషన్ భవనం ప్రారంభోత్సవానికి వార్డ్ కార్పొరేటర్ కెల్లా సునీత తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నేడు ఆధునిక యోగ పేరుతో మనిషి బద్ధకస్తునిగా మారారని ప్రతి వస్తువు కాళ్ల దగ్గరికి రావడంతో వారిలో శారీరక శ్రమ పూర్తిగా క్షీణించిందని, ఈ పరిస్థితిలో మనిషికి ఎన్నో రకాల వ్యాధులు ప్రబల్లే అవకాశం ఉన్నందున వారి ఆరోగ్యరీత్యా ప్రతి ఒక్కరూ రోజులో ఒక గంటపాటు నటక లేదా యోగ, ధ్యానం ఏదో ఒక దానిని ఎంచుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాల్సిన అవసరం

(మిగతా 2లో)


ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ
వధూవరుల వివాహ పరిచయ వేదిక
తేదీ:25డిసెంబర్ 2022
ఉదయం 10గంటల నుండి.
వేదిక: శ్రీ కామాక్షి పీఠం, కృష్ణా రావు వీధి
కూచిమంచి వారి అగ్రహారం
అమలాపురం, కోనసీమ జిల్లా.
అన్ని వయసుల వారికి తగిన
సుమారు 500మంది వధూవరుల వివరములు కలవు.
ఒక సారి రిజిస్ట్రేషన్ చేయండి
వివాహం కుదిరేవరకు సేవలు పొందండి.
ఆరేళ్ళలో 1200 పైగా వివాహాలు జరిగిన
విజయవంతమైన వివాహ వేదిక
జనహిత మ్యాట్రిమోనీ, విశాఖపట్నం.
ఫోన్లు: అమలాపురం: 85558 06336 హరి.
విశాఖపట్నం: 9393949345,
కాకినాడ: 99494 13661 కె.బి.రామారావు &
7013118088.ఆర్.వి.టి. సత్యనారాయణ
వైజాగ్ ఆఫీస్: 7382962196
8054841293 కె.వి.శర్మ

(మొదటి పేజీ తరువాయిలు)

## నాణ్యతలో రాజీ పడొద్దు.. సీఎం కీలక ఆదేశాలు

అందించేందుకు సిద్ధంగా ఉంది. అయితే ఆ మేరకు కచ్చితమైన ఫలితాలు కూడా రావాల్సి ఉందన్న సీఎం. సూపర్‌వైజర్స్ సక్రమంగా పని చేయాలి. వీరి పనితీరుపైనా పర్యవేక్షణ ఉండాలన్న సీఎం. సూపర్‌వైజర్స్ వ్యవస్థ ద్వారా అంగన్‌వాడీలలో పనితీరు మెరుగవడంతో పాటు నాణ్యత కూడా పెరుగుతుందన్న సీఎం. అంగన్‌వాడీల నుంచే పిల్లలకు భాషపై గట్టి పునాది అందించాలన్న సీఎం. పిల్లలకు ఉత్తమ అభ్యాసాలు ఉండాలన్న ముఖ్యమంత్రి.

మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సీఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యాశాఖ (మౌలిక సదుపాయాలు) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే ఇతర ఉన్నతాధికారులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.

## ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించండి

కొత్త ఓటర్లను గుర్తించమన్నారు. ఫారం -6 ప్రకారం 46వేలు ఎంక్వయిరీ చేయాల్సి ఉందన్నారు. ఈనెల 23 నాటికి ఎంక్వయిరీ పూర్తి చేయడానికి అధికారులనుఆదేశించమన్నారు.

49 వేల 439 ఒకే రకమైన ఫొటోలు ఉన్నాయని సమగ్రమైన విచారణ చేసి డూప్లికేట్ ఓటర్లను తొలగిస్తామని చెప్పారు. పట్టభద్రుల వాటర్ జాబితాను పక్కగా రూపొందించడానికి అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి .దయానిధి తదితరులు పాల్గొన్నారు.

## ముడసర్లోవలో వాకర్స్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించిన నగర మేయర్

ఉందని తెలిపారు.ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు జీవీఎంసీ తరపున షెడ్డు నిర్మించేందుకు స్థలము కేటాయించామని, దానిలో వారు షెడ్ నిర్మించారని యోగ, ధ్యాన శిక్షణ శిబిరం ఇందులో నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముడసర్లోవ వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మూర్తి, సెక్రెటరీ ఈశ్వరరావు, విశిష్ట అతిథి మోహన్ రావు, ఇతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో 11 పట్టణాల్లో క్లీన్ ఎయిర్

**న్యూఢిల్లీ:** నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద గాలి నాణ్యతను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్లో విజయవాడ, విశాఖపట్నంతోపాటు అదనంగా మరో 11 పట్టణాలను ఎంపిక చేసినట్లు పర్యవరణ శాఖ సహాయ మంత్రి శ్రీ అశ్విని కుమార్ చౌబే వెల్లడించారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ 15వ ఆర్థిక సంఘం నివేదికి ప్రకారం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నంకు అదనంగా మరో 11 పట్టణాలను గుర్తించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన పట్టణాల్లో శ్రీకాకుళం, చిత్తూరు, ఒంగోలు, విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, అనంతపురం, కడప, కర్నూలు, గుంటూరు, నెల్లూరు ఉన్నట్లు చెప్పారు. జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం కింద పైన పేర్కొన్న పట్టణాల్లో గాలి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

విశాఖపట్నం, విజయవాడ నగరాలలో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు పనితీరు ఆధారిత గ్రాంట్‌ను ఇస్తూ 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఈ గ్రాంట్ కింద విజయవాడకు 2022-23లో 163 కోట్లు కేటాయించగా, 2021-22లో100.35 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే 2022-23 సంవత్సరం వరకు విశాఖ నగరానికి 148 కోట్లు కేటాయించగా, 2021-22 వరకు 100.75 కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

## రాజశ్యామల యాగానికి సీఎంను ఆహ్వానించిన స్వాత్మానందేంద్ర స్వామీజీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి గురువారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసారు. జనవరి 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు విశాఖ శారదాపీఠం వార్షికోత్సవాలు జరగనున్నాయని సీఎంకు తెలిపారు. వార్షికోత్సవాల సందర్భంగా రాజశ్యామల యాగం నిర్వహిస్తున్నామని అన్నారు. యాగంలో రాజశ్యామల అమ్మవారి మూల మంత్రాలతో లక్ష సార్లు హవనం జరుగుతుందని వివరించారు. ఉత్సవాలలో పాల్గొని రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం, పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు పొందాలని అన్నారు. స్వాత్మానందేంద్ర స్వామి వెంట ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

# రైతులకు రూ.8.6కోట్లు చెల్లింపు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపులు ప్రారంభం అయ్యాయని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా చేయుటకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు పరికరాలు అందించామని చెప్పారు. జిల్లాలో రూ.27.15 కోట్ల విలువ గల 13310.64 మెట్రిక్ టన్నుల ధాన్యంను 2,344 మంది రైతుల నుండి కొనుగోలు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.8.69 కోట్లను 844 మంది రైతులకు చెల్లింపు చేశామని ఆయన అన్నారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించు ప్రక్రియలో ఉందని ఆయన పేర్కొన్నారు.

రైతుల్లో ఆనందం

ధాన్యం కొనుగోలు నగదును సకాలంలో జమ కావడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి విక్రయించానని ఇందుకు సంబంధించిన మొత్తం ఖాతాలో జమ అయిందని పలువురు రైతులు చెప్పారు.సేకరించిన ధాన్యంను గిడ్డంగులలో నిల్వకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. బలిజిపేట వేర్ హౌస్ గోడౌన్ లలో ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు ఎఫ్ సి ఎ అనుమతి ఇచ్చారన్నారు. జిల్లా నుంచి దశల వారీగా 50వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్ సి ఏ కి ఇవ్వడానికి అనుమతించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ దేవుల నాయక్, డి ఎస్ ఓ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు కొత్తకోట రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ భాను, పలువురు రైస్ మిల్లర్ల యజమానులు, తదితరులు, పాల్గొన్నారు

# ప్రారంభమైన శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ



**విజయనగరం (బొబ్బిలి):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం బొబ్బిలి వేదికగా గురువారం ప్రారంభమయ్యింది. ఇప్పటి వరకు జిల్లాలో 180 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా గురువారం బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో తొలి విడత పట్టాల పంపిణీని చేపట్టారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే సంబంగి చిన వెంకట అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులు పాల్గొని రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల కష్టాలు తెలుసుకొని వారి భూములకు శాశ్వత హక్కులు కల్పించాలనే మంచి ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియ రైతుల పాలిట వరం అని పేర్కొన్నారు. దీని వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, కష్ట నష్టాలు తీరిపోతాయని అన్నారు. రైతుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని, అధికారులు, సిబ్బందే రైతుల వద్దకు వచ్చి సేవలు అందిస్తారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పటిష్ఠమైన వ్యవస్థ లేకపోవటం వల్ల మోసాలు జరిగేవని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చొరవతో నేడు రాష్ట్రంలో పటిష్ఠమైన వ్యవస్థ రూపుదిద్దు కుందని ఛైర్మన్ పేర్కొన్నారు. రీ సర్వే అనే మహా కార్యం ద్వారా భూ సంబంధిత సమస్యలు తొలగిపోతాయని ప్రజలు నిర్భయంగా ఉండొచ్చని అన్నారు.

నా భూమి పత్రాలు మార్చేశారు

భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ మెరకముడిదాం మండలం సోమలింగాపురంలోని తనకి చెందిన భూమి పత్రాలు మార్చేసి కొంతమంది బ్యాంకు ద్వారా రుణం పొందారని ఛైర్మన్ పేర్కొన్నారు. ఇదంతా గత ప్రభుత్వ హయాంలో పటిష్ఠమైన వ్యవస్థ లేకపోవటం వల్ల జరిగిందని అన్నారు. నేడు అందుబాటులోకి వచ్చిన పటిష్ఠమైన వ్యవస్థ ద్వారా రికార్డులు సరి చేయించుకున్నానని వివరించారు.

కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి ఆర్డీవో శేష శైలజ ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలను వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో 79 గ్రామాల్లో 1.50 లక్షల ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశామని, 300 మందికి హక్కులు కల్పించామని పేర్కొన్నారు.

అనంతరం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నో అధ్యయనాలు చేసిన తర్వాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల రీ సర్వే చేశారని.. దీని వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో బొబ్బిలి నియోజకవర్గంలో సర్వే ప్రక్రియ విజయవంతంగా జరిగిందని, సుమారు 79 గ్రామాల్లో ప్రక్రియను నిర్వహించామని వివరించారు. రైతుల కష్టాలు తీరిపోయాయని హర్షం వ్యక్తం చేశారు.

రూపాయి ఖర్చు లేకుండా సులభతర విధానంలో రికార్డుల ప్రక్షాళన జరుగుతుందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పేర్కొన్నారు. రైతుల వద్దకే సర్వే, రెవెన్యూ సిబ్బంది వచ్చి సేవలు అందిస్తారని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ ద్వారా రైతులకు శాశ్వత హక్కులు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా తెర్లాం రెవెన్యూ సిబ్బంది ప్రదర్శించిన లఘు నాటిక విశేషంగా ఆకట్టుకుంది.

కార్యక్రమంలో బొబ్బిలి ఆర్డీవో శేష శైలజ, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణ, బొబ్బిలి, తేర్లాం, రామభద్రపురం, బాడంగి మండలాల తహశీల్దార్లు, జెడ్పీటీసీలు, ఎంపిటిసిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు .

# మాజీ సీఎస్ శమీర్ శర్మ 17న జిల్లాకు రాక

**విజయనగరం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి చీఫ్ ఎక్జిక్యూటివ్ అధికారి అయిన శమీర్ శర్మ ఈ నెల 17 వ తేదీన జిల్లాకు విచ్చేస్తున్నారు. ఆ రోజు ఉదయం విశాఖపట్నం నుంచి విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రోడ్ మార్గం ద్వారా చేరుకుంటారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సస్థిరాభివృద్ధి లక్ష్యాలపై జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సూర్యకుమారి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంబంధిత విభాగాల అధికారులంతా హాజరు కావాలని సూచించారు.


పంచాంగం

శుక్రవారం 16-12-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం హేమంత రుతువు
మార్గశిర మాసం

తిథి : బ. అష్టమి రా. 03.00
నక్షత్రం : పుబ్బ ఉ. 07.33
వర్జ్యం : మ. 03.15 ల 04.57





## పక్షవాతం హరించుటకు సులభ యోగం

నీరుల్లి రసం 20ml, అల్లం రసం 20ml, తేనె 20ml కలిపి ఉదయాన్నే పరగడుపున , సాయంత్రం ఆహారానికి గంట ముందు లోపలికి తీసుకోవలెను .

పైపూతగా ఒక స్పూన్ నువ్వుల నూనె తో రెండు చిటికెల మిరియాల పొడి బాగుగా కలిపి గోరువెచ్చగా చేసి ఆ నూనెతో పై నుంచి క్రిందకి చచ్చుబడిన అవయవానికి బాగుగా మర్దన ( మసాజ్ ) చేయవలెను .

వాతాన్ని కలిగించే గడ్డ కూరలు , మాంస పదార్థాలు , పెరుగు , చల్లని నీరు , వంకాయ , గోంగూర , మినప పదార్థాలు , పాతపచ్చళ్లు తినకూడదు .

ఆయుర్వేదములోని ఎన్నో రహస్య మూలికల అనుభవ యోగాల గురించి నా గ్రంథాల యందు సంపూర్ణముగా , అందరికి అర్థమయ్యే సులభ భాషలో వివరించాను . వాటిని చదివి మరింత విజ్ఞానాన్ని పొందగలరు .

## లిక్కర్ బ్యాన్ ఉంది..కల్తీ మద్యం సేవిస్తే, ప్రాణాలు కోల్పోతారు



**పాట్నా:** బీహార్‌లో కల్తీ మద్యం తాగిన కేసులో మృతులపై సీఎం నితీశ్ కుమార్ స్పందించారు. కల్తీ మద్యం సేవిస్తే, ప్రాణాలు కోల్పోతారని ఆయన అన్నారు. చాప్రా విషాదంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మద్య నిషేధం లేని రోజుల్లో కూడా ఇక్కడ కల్తీ మద్యం తాగి జనం చనిపోయినట్లు సీఎం తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇక్కడ లిక్కర్ బ్యాన్ ఉందని, కల్తీ మద్యాన్ని అమ్ముతారని, దాని వల్ల ప్రజలు చనిపోతారని, మద్యం మంచిది కాదని, ఎవరూ తాగకూడదని సీఎం నితీశ్ అన్నారు.కల్తీ మద్యం తాగి మృతిచెందిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని గతంలో కొందరు డిమాండ్ చేశారని, ఎవరైనా మద్యం సేవిస్తే ప్రాణాలు కోల్పోవడం తప్పదని, మన కళ్ల ముందే ఇవన్నీ కనిపిస్తున్నాయని, ఇలాంటి ఘటనలు విషాదాన్ని మిగిల్చుతాయని, ఆ ప్రాంతాలను విజిట్ చేసి, వారికి కల్తీ మద్యం గురించి వివరించాలని సీఎం నితీశ్ తెలిపారు. పేదలను అరెస్టు చేయవద్దు అని అధికారుల్ని ఆదేశించానని, కానీ లిక్కర్‌ను తయారు చేసేవాళ్లను, ఆ వ్యాపారాన్ని నిర్వహించేవాళ్లను పట్టుకోవాలని ఆదేశించినట్లు సీఎం నితీశ్ తెలిపారు.మద్య నిషేధం వల్ల చాలా మంది ప్రజలు బెనిఫిట్ పొందారని, ఎంతో మంది మద్యాన్ని త్యజించారని, ఇది మంచి పరిణామం అని, అనేక మంది మద్య నిషేధ నిర్ణయాన్ని స్వాగతించారని, కానీ కొందరు ఎప్పుడూ సమస్యలు సృష్టిస్తుంటారని, అలాంటి వాళ్లను పట్టుకోమని అధికారులకు ఆదేశించినట్లు సీఎం నితీశ్ తెలిపారు. బీహార్‌లో కల్తీ మద్యం తాగిన కేసులో మృతిచెందిన వారి సంఖ్య 39కి చేరుకున్నది. శరన్ జిల్లాలోని చాప్రా ప్రాంతంలో జరిగిన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది.



వి-శాఖ సమాచారమ్

శుక్రవారం 16-12-2022

# బాపు జన్మదినం

'గుండ్రంగా రాయడం రాక ఇలా వంకరటింకరగా లాగించేస్తున్నాడు... ఏం తెలివి?' అనేసుకుని నోట్లో కొంగులూ, కండువాలూ కుక్కేసుకున్నార్ట!

ఆ అక్షరాలు చూడ్డానికి అదోలా వుంటాయి. కాసేపు చూస్తే 'ఏదోవుందిందులో!' అనిపించేస్తుంది. ఆనక పుస్తకం మూసేశాక మళ్ళీ తెరిచి చూడాలనిపిస్తుంది.

మనం పెట్టే కొమ్ములూ, దీర్ఘాలన్నింటినీ కొత్తరకంగా తగిలించే తెలివి.

పేరంతా రాసేసిన తరవాత చూస్తే ఊరేగింపుకి తయారైన దేవుడిపల్లకీలా వుంటుంది.

ఆ నిండుదనం గోదారినించీ, ఆ అందం చందమామనించీ తెస్తాడు.

ఇహ బొమ్మలు....

ఒక స్త్రీ బొమ్మంటే మనం చదువుకున్న సామాన్యశాస్త్రం పుస్తకంలో ఆడమనిషి బొమ్మలా అందరూ వేస్తున్నరోజుల్లో ఇతగాడు చుక్కలముగ్గెట్టినంత చులాగ్గా వేసేసి చూపించాడు.

రావాకుల్లా పరుచుకున్న రెండుకళ్ళు, మకరధ్వజాల్లా కనుబొమ్మలు, చదరంగంలో శకటులా ధీటైన ముక్కు, చిన్న చెగోడీలా నోరూనూ!

చూడగానే ముద్దిస్తున్నట్టూ, ముద్దొస్తున్నట్టూ అనిపించేస్తుంది ఎవరికైనా!

ఇహ మెడా, జడా సంగతి సరేసరి! జుట్టంతా పొందిగ్గా అల్లి, పాపిడితీసి, నాగుబాములా పేద్ధ జడేసేసేవాడు. చివర్న ఓరెండు గంటలు కట్టేవాడు.

నడుం మీద ఆట్టే ఆసక్తి చూపెట్టేవాడు కాదు. ఎంచేతంటే... అసలది వుంటేగా? అలా గీసేవాడు మరి!

ఈ యవ్వారాలన్నీ పూర్తయ్యేసరికి మగపిల్లలందరికీ గుండెల్లో గుబులు మొదలయ్యింది.

'పెళ్ళిచేసుకోరా నాయనా!' అని బామ్మలూ, అమ్మానాన్నలూ అడిగితే 'బాపూబొమ్మను తీసుకురండం'టూ బ్రాండొకటి చెప్పేవారు. అలాంటి పిల్లలే కావాలంటే ఎక్కణ్ణించొస్తారు? ఆఖరికి అదొక గోల్డ్ స్టాండర్డ్ అయి కూర్చుంది.

ఇహ ఈ రవణుఉన్నాడే! గొప్ప కబుర్లపోగు. ఏవో కథలూ గట్రా రాస్తూండేవాడు. ఆయనగారి మనంలో ఏఉవుందో ఈయనకి తెలిసిపోయేది. ఈయనగారి కలంలో ఏఉవుందో ఆయనకి అర్థమైపొయ్యేది.

బుడుగూ, సీగానపెసూనాంబ.... అనేసి రెండుపేర్లు అనుకుని 'ఓం విఘ్నేశ్వరాయ' అని ముందస్తుగా రాసి మొదలెట్టగానే ఈయనేసిన రెండు బొమ్మలూ రూపం తెచ్చేసుకున్నాయి. ఆనక వాళ్ళనాన్న గోపాళం, రాద, బాబాయ్, రెండుజెళ్ళసీత, పక్కింటి లావుపాటి పిన్నిగారు, ఆవిడ ముగుడు... అందరికన్నా అందంగా... వత్తులపెట్లో డబ్బులు దాచుకునే బామ్మ... వీళ్ళందరి బొమ్మలూ వేషాలేసుకుని పుస్తకమ్మీదకి వచ్చేశాయి.

మనకింక తడుంకునే పన్లేదు. 'బుడుగంటే ఎలావుంటాడూ?' అని నీ బుర్రనీ, పుస్తకాన్నీ చించుకోవాల్సిన అవసరంలేకండా తాళ్ళలాగేసి, ఓ బుగ్గలబూరిగాణ్ణి మనముందు నిలబెట్టేశాడు.

రెండు కొత్తిమీర కట్టల్లాంటి జళ్ళేసి సీగాననీ లాక్కొచ్చేశాడు. వాళ్ళెంత నచ్చేస్తారంటే అందరూ చూస్తుండగా వందసార్లూ, ఎవరూ చూడకండా మరోవందసార్లూ పుస్తకాన్ని ముద్దెట్టేసుకునేంత!

వీళ్ళిద్దరితోనే అయ్యిందేఉవిటి?

'రామపట్టాభిషేకం పటం ఇంటోవుంటే శుభం! బాపూదయితే ఇంకా శుభం!'....

ఇది మన తెలుగింటి నానుడి! నేనన్నది అతిశయోక్తేమోగానీ అతిమాత్రం కాదు.

ఓమారు ఆ చివర్నించి ఈచివరిదాకా చూడండి...

సీతారాములేమో మొహమాటంగానూ, లక్ష్మణ భరత శత్రుఘ్నులేమో 'హమ్మయ్య! అన్నయ్యొచ్చేశాడు! ఇహ మనకేం ఫరవాలేద'న్నట్టుగానూ, వసిష్టులవారేమో 'ఈరోజుకోసం ఎన్నాళ్ళనించి చూస్తున్నానో తెలుసా రామా?' అన్నట్టుగానూ, ఇహ హనుమంతుడయితే 'నాకోసవేఉ అప్పుడాగిపోయింది పట్టాభిషేకం. నే లేననే! అదీ అదృష్టఉవంటే!' అనుకునేంత గాఢభక్తితోను...

చూస్తూనే వుండిపోయి, చుట్టుపక్కలేం జరుగుతోందో కూడా మర్చిపోతావు.

ఆ క్షణంలో ఓ అప్పారావొచ్చి 'ఓ ఫైవ్ లాక్స్ అప్పిస్తావోయ్?' అనడిగినా ఇచ్చిపడేస్తావ్! అంత విషయం వుందక్కడ!

ఈయన బొమ్మ వుందంటే పుస్తకానికి పసుబ్బొట్టు పెట్టినంత అందం. గుమ్మానికి మావిడాకు కట్టినట్టు, కొత్తబట్టలు కొనుక్కున్నట్టు పత్రికలవాళ్ళు పండగలన్నిటికీ ఈయన్నే వెయ్యమనేవారు ముఖచిత్రాన్ని.

అంతవరకూ ప్రతివారం వచ్చే వాణిశ్రీలూ, జమునలూ, జయప్రద, సుధ, చిత్రలూ మాయమైపోయేవారు. వాళ్ళందరికన్నా అందంగా ఓ పిల్ల దిగేది. ఆ పుస్తకాన్ని లోపలి కథలకోసం కొందరూ, బయట బొమ్మకోసం కొందరూ ఏళ్ళతరబడి దాచుకునేవారు.

అమరావతి కథలకి ఈయన గీసిన బొమ్మల్ని చూశారా? సత్యంగారి ఆత్మ బాపు బొమ్మల్లో కనబడుతుంది. ఆయనేవఉనుకుని రాశాడో తెలీదుగానీ 'రాగిచెంబులో చేపపిల్ల', 'భోజన చక్రవర్తి', 'ముద్దులల్లుడు' కథలకి బొమ్మలొకసారి చూడండి.

పుస్తకంలేదా మీయింటో? అదేమరి! మీరేం తెలుగువాళ్ళూ? కథని చదివి, జీర్ణంచేసేసుకుని, రక్తంలోకీ, మనసులోకీ ఎక్కించుకుని ఆనక బుర్రకి పనిచెప్పి ఓబొమ్మగీస్తే.... కథంతా ఒక్క బొమ్మలో తెలిసిపోతుంది! అంత పనిమంతుడు మన బాపు!

మిథునవైఉతే ఇహ లాభంలేదని ఏకంగా మొత్తం తన దస్తూరీలోనే రాసిపడేశాడు. ఒకసారి దూరంనించి చూస్తే పళ్ళెంలో పారిజాతాల్లా వుంటాయి అక్షరాలన్నీ!

ఏరి వాసన చూడాలన్నంత అందంగా!

ఎంతమందికో కథలకీ, నవలలకీ బొమ్మలేశాడు. సినిమా పుస్తకాల్లో రేలంగిరిజల్నీ, జమునాసావిత్రుల్నీ కళ్ళకి కట్టేసేవాడు.

అంతర్జాతీయ స్థాయి అందాలబొమ్మల అపురూప చిత్రకారుడు...

అమరలోకంలో రంభావూర్వశులు రోజూ వాళ్ళ బొమ్మలెయ్యమని సలపాడిస్తూ వుండేవుంటారు.

తన బొమ్మల్ని చూస్తూ పెరిగాం. తన బొమ్మల్ని చూస్తుండగానే మనలనొదిలి వెళిపోయాడు. మనసులో ఆ బొమ్మ మాత్రం పదికాలాలపాటు పదిలంగా అలానే వుంటుంది.

# కొత్త బయో సీఎన్జీ ప్లాంట్లకు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుంది



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గత ఐదు సంవత్సరాలలో దేశంలో స్థాపించబడిన బయో-సిఎన్జి ప్లాంట్ల వివరాలు తెలపాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బిసెట్టి వెంకట సత్యవతి గారు గురువారం పార్లమెంట్ లో కోరారు. దేశవ్యాప్తంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కొత్త బయో-సిఎన్జి ప్లాంట్ల స్థాపనను ప్రోత్సహించడానికి మరియు ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందా అని ప్రశ్నించారు. అలా అయితే, దాని వివరాలు కాకపోతే, దానికి గల కారణాలు ఏమిటన్నారు. దీనికి కొత్త పునరుత్పాదక ఇంధనం మరియు శక్తి మంత్రి ఆర్.కె. సింగ్ బదులిస్తూ గత ఐదు కాలంలో దేశంలో స్థాపించబడిన బయో-సిఎన్జి ప్లాంట్ల రాష్ట్రం యుటి వారీగా వివరాలను వివరించారు.

గ్రామీణ ప్రాంతాలతో సహా దేశవ్యాప్తంగా కొత్త బయో-సిఎన్జి ప్లాంట్ల స్థాపనను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు.

కొత్త మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ జాతీయ బయోఎనర్జీ ప్రోగ్రామ్ గొడుగు కింద వేస్ట్ టు ఎనర్జీ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తోందన్నారు. వేస్ట్ టు ఎనర్జీ ప్రోగ్రామ్ ఎఫ్ వై 2021-22 నుండి 2025-26 కాలానికి రూ. 600 కోట్ల బడ్జెట్‌ను కలిగి ఉందనీ ఈ కార్యక్రమం, ఇతర ప్రాంతాలలో, కేంద్ర ఆర్థిక వ్యవస్థను అందించడం ద్వారా పట్టణ, పారిశ్రామిక మరియు వ్యవసాయ వ్యర్థాల నుండి బయో సిఎన్జిఉత్పత్తి కోసం ప్లాంట్ల ఏర్పాటుకు మద్దతు ఇస్తుందన్నారు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ (డి డి డబ్ల్యు ఎస్) 2018లో గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో-అగ్రో రిసోర్సెస్ ధన్ పథకాన్ని ప్రారంభించిందన్నారు.

# కేంద్రం నిధులిస్తున్నా ఇళ్ళు కట్టలేని రాష్ట్రం



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు :రాష్ట్ర ప్రభుత్వం పట్టణభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ఇళ్ల నిర్మాణానికి 100 శాతం నిధులు కేంద్రమే ఇస్తున్న, వాటిని వినియోగించుకుని పేదల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే స్థితి లో రాష్ట్ర ప్రభుత్వం లేకపోవటం దారుణం అని బీజేపీ ఎస్టి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుస ఉమా మహేశ్వర రావు మండిపడ్డారు, ప్రధాన మంత్రి అవాస్ యోజన ( గ్రామీణ ) పథకం కింద రాష్ట్రానికి 1.82 లక్షల గృహాలు కేటాయిస్తే ముడున్నారేళ్లలో 5 మాత్రమే పూర్తి చెయ్యటం,వైకాపా ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న చిత్త శుద్ధినీ తెలియజేస్తుందనీ గురువారం ఒక ప్రకటన లో వెల్లడించారు, పేద ప్రజలు సొంత ఇళ్లల్లో ఉండటం వైసీపీ ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుంది,2019-23 మధ్య కాలం లో వివిధ రాష్ట్రాలు 97 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తే, ముఖ్య మంత్రి జగన్ 5 ఇళ్ళు మాత్రమే కట్టారు, సంక్షేమ ప్రభుత్వమని ఒకవైపు చెబుతూ మరో వైపు పేదలకు వెన్నుపోటు పొడుస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం. గత ఆర్థిక సంవత్సరం 50 వేల సోలార్ పంపుసెట్లను అందించమని నిధులిస్తే, వాటిని వినియోగించకుండా తిరిగిచ్చేసారు, కరోనా సమయంలోనూ కేంద్రం ఇచ్చిన ఉచిత బియ్యాన్ని పక్కా దారి పట్టించి పేద ప్రజల పొట్ట కొట్టిన దూర్మార్గ ప్రభుత్వం ఈ వైసీపీ ప్రభుత్వం అని మండి పడ్డారు.కార్యక్రమం లో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందోలి ఉమా మహేశ్వర రావు, మినుముల గోపాల పాత్రుడు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో 49 అంగన్వాడీ పోస్టుల భర్తీకి ధరఖాస్తుల ఆహ్వానం

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఖాళీగా ఉన్న 49 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులనుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు డివిజన్ ఫరిదిలో ఖాళీగా ఉన్న 37 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి, రంపచోడవరం డివిజన్ ఫరిధిలో చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా రంపచోడవరం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు అంగన్వాడీ ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి, చింతూరు డివిజన్ ఫరిడిలో ఖాళీగా ఉన్న ఏడు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు 2022 డిసెంబర్ 17 నుండి 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారికి నేరుగా గాని పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేయదలచిన మహిళలు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, ప్రధానంగా స్థానికంగా నివాసం కలిగి ఉండాలని వివాహిత స్త్రీ అయి ఉండాలని కలెక్టర్ తెలిపారు. 2022 జులై 1 నాటికి అభ్యర్థులు 21 సంవత్సరములు పూర్తి చేసి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాల లోపు అభ్యర్థులు లభించని పక్షంలో 18 సంవత్సరాలు పూర్తయిన వారి దరఖాస్తులు పరిశీలించబడతాయని అయితే కేవలం ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలకే వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణత 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు, పూర్తి అనాధ, క్రెచ్, హోమ్, ప్రభుత్వ సంస్థలలో నివశించు సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగ వ్యక్తులకు ఐదు మార్కులు మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులకు లెక్కించబడుతుంది అని తెలిపారు. మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, వారి అర్హతలను, మార్కులను పరిశీలించి ఎంపిక చేయటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# అనకాపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్ కుట్టుమిషన్లు పంపిణీ




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి రోటరీ క్లబ్ గురువారం స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసింది. విశాఖపట్నంలో రోటరీ విస్తా సమావేశానికి రోటరీ అంతర్జాతీయ మహిళా అధ్యక్షురాలు జెన్నీఫర్ జోన్స్ వచ్చిన సందర్భముగా మహిళల ఉపాధి కోసం మూడు వేల కుట్టు మిషన్లు గర్ల్స్ స్కూల్ విద్యార్థులకు వెయ్యి సైకిళ్లు వికలాంగులకు వెయ్యి వీల్ చైర్స్ గిరిజన ప్రాంత మహిళలకు 1500 పొగరానీ పొయ్యలు మంజూరు చేశారు. అందులో అనకాపల్లి రోటరీ క్లబ్ కి 100 సైకిళ్లు,400 కుట్టుమిషన్లు, 30 వీల్చైర్లు, 100 పొయ్యిలు ఇవ్వడం జరిగినది. వాటిలో సైకిళ్లు 100, బీ కుట్టి మిషన్లు100 బీ 30 వీల్ చైర్స్ రొటీరియన్ పి. డి.జి. కిషోర్ కుమార్ చేతుల మీదుగా ఇవ్వడం జరుగుతుంది. రోటరీ పోలియో నిర్మలనే కాకుండా మారుమూల గ్రామాల్లో విద్య వైద్య రంగాలలో సేవలు అందించడానికి ప్రాజెక్ట్ చైర్మన్ కడిమి శెట్టి సతీష్ చెప్పారు. ఈరోజు సమావేశమునకు ప్రెసిడెంట్ సాన త్రినాధరావు, సెక్రటరీ పెంటకోట రాజేష్ నాయుడు,అసిస్టెంట్ గవర్నర్ పెంటకోట పవన్ కుమార్, ఫౌండేషన్ చైర్ P.రాజేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగినది. ఈ సమావేశానికి డాక్టర్ శేషు కుమార్ ,డి. అనిల్ ,ఎస్. రాజేష్, బి.ఎస్. గుప్తా ,వి .రవిరాం , బి. సర్వా రావు, కె. ఎల్. ఎన్. కుమార్, గౌరీపతి , కె.వి లక్ష్మీనారాయణ తదితరులు హాజరైనారు.

# ఈనెల 18న గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు రగ్గులు పంపిణీ

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 9 గంటలకు మండలంలోని తుమ్మపాల చిన్న బాబు కాలనీ తిలక్ మార్గ్ లో వృద్ధులకు వికలాంగులకు పేదలకు రగ్గులు బియ్యం పంపిణీ జరుగుతుందని సంస్థ వ్యవస్థాపకుడుకొణతాల ఫణిభూషణ శ్రీధర్ తెలిపారు. కసింకోట సబ్ ఇన్స్పెక్టర్ జక్కుల నాగేశ్వరరావు సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు

# పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర పై వక్తృత్వపు పోటీలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అమరజీవి పొట్టి శ్రీరాములు 70 వర్ధంతి సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ జంక్షన్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం వర్ధంతి కార్యక్రమం జరిగింది. పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జీవీఎంసీ హైస్కూల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణయాలుగా భారతీదేవి పద్మ కుమార్ వ్యవహరించారు. విద్యార్థులకు పొట్టి శ్రీరాములు స్టిక్కర్లను పంపిణీ చేశారు . విజేతలకు మూర్తి బహుమతులను అందజేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి పురస్కరించు కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# జీజీహెచ్ లో డిఎంఈ తనిఖీలు

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** బోధనాసుపత్రి కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఈ), నోడల్ అధికారి డా. సత్యవరప్రసాద్ గురువారం పలు వార్డుల్లో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేసి ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని కోరారు.అత్యవసర విభాగాలు, ఐసియూ, ఆర్ ఐ సి యూ,ఎన్ఐసియూ,పి ఐ సియూ వార్డుల్లో వైద్యులు నిరంతరాయంగా విధులు నిర్వర్తించే విధంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారిశుధ్య పర్యవేక్షణ,వార్డుల్లో శుభ్రత పాటించాలనీ, చెప్పులతో ప్రవేశించడం నిషేధించాలని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.మెడికల్, సీటీ స్కాన్ యూనిట్, పిల్లల విభాగం,నవజాత శిశువుల విభాగం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.హేమలత, ఆర్ఎంఓ డా. అనిత,మెడిసిన్ విభాగాధిపతి డా.హరి విజయకుమార్,వివిధ విభాగాల అధిపతులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో భర్తను హత్య చేసిన భార్య

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం దరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రక్కన ఉన్న నివాసాల్లో ఈ కుటుంబం వుంటున్నారని, భార్య భర్తల మధ్య గత కొద్ది కాలంగా కోర్టు కేసు వివాదం నడుస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా గత రాత్రి భార్య వద్దకు భర్త వచ్చి కేసు విత్ డ్రా చేసుకోవాలని లేదంటే నీ అంతు చూస్తామని అనడంతో భార్య కోపంతో తన వద్ద ఉన్న రాడ్డుతో తలపై కొట్టడంతో అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోవడం జరుగిందని తెలిపారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

## ఆచార్య వెలమల సిమ్మన్నగారికి "చిన్నయ్యసూరి పురస్కారం".

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యవంలో..ఈనెల 20వ తేదీ, సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో 'పరవస్తు చిన్నయ్యసూరి జయంతి' వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సాహిత్య సభలో.. పురప్రముఖులు, పండితుల చేతులమీదుగా "చిన్నయ్యసూరి సాహితీ పురస్కారాన్ని" ఆచార్య వెలమల సిమ్మన్నగారికి అందజేస్తున్నారు. 'నిత్య సాహిత్య కృషీవలుడైన ఆచార్య వెలమల సిమ్మన్నగారికి చిన్నయ్యసూరి పురస్కారం ఇచ్చుకోవడం.. పద్యపీఠానికి గౌరవంగా భావిస్తున్నామని పద్యపీఠం & తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు సూరి తెలియజేశారు.

# దేవాదాయ శాఖకు స్వరూపానందేంద్ర స్వామీజీ సూచన

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక పురాతన ఆలయాలు శిధిలావస్థకు చేరుకుంటున్నాయని, అటువంటి ఆలయాల జీర్ణోద్ధరణకు దేవాదాయ శాఖ ప్రాధాన్యత ఇవ్వాలని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి సూచించారు. నూతన ఆలయాల నిర్మాణానికి అనేక మంది ధార్మిక వేత్తలు ముందుకొస్తున్నందున జీర్ణోద్ధరణ చేపట్టాల్సిన అవసరమే ఎక్కువగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా శ్రీకూర్మం, ద్రాక్షారామం వంటి ఆలయాల్లో కుంభాభిషేకాలు నిర్వహించాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరి జవహర్‌లాల్ విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామితో అనేక అంశాలపై చర్చించారు. శాఖాపరంగా ఇటీవల ప్రభుత్వం చేపట్టిన నిర్ణయాలను స్వరూపానందేంద్ర స్వామి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారం కోసం స్వరూపానందేంద్ర స్వామి పలు సూచనలు చేసారు. అర్చకుల వేతనాలు, వంశపారంపర్య హక్కులకు సంబంధించిన పాలనాపరమైన ఇబ్బందులను తొలగించాలని అన్నారు. స్వధర్మ వాహిని ప్రచార యాత్ర నిమిత్తం ఇటీవల పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి రాయలసీమలో పర్యటించిన సందర్భంగా కదిరి, కసాపురం తదితర క్షేత్రాల్లో భక్తులకు వసతులు లేకపోవడాన్ని గమనించారని, వసతుల కల్పన దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపైనా స్వరూపానందేంద్ర స్వామి ఆరా తీసారు. స్వరూపానందేంద్ర స్వామి ప్రస్తావించిన అంశాలపై కమిషనర్ హరి జవహర్‌లాల్ సానుకూలంగా స్పందించారు. భూముల విషయంలో రాజీ పడేది లేదని ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్వామీజీకి హామీ ఇచ్చారు.

## ముఖ్యమంత్రినిని మర్యాదపూరకంగా కలిసిన జమ్మాన



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): విజయనగరం జిల్లా పర్యటనలో టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేస్తూ అడ్వాన్స్ హ్యాపీ బర్త్ డే తెలియజేస్తూ రాష్ట్రంలో వాచే వారం రోజుల్లో గుంటూరు అమలాపురం రామచంద్రపురం శ్రీకాకుళం నంద్యాల పొన్నూరు పట్టణాలలో సుమారుగా 20000 గృహాలను లబ్ధిదారులు కు అందజేస్తున్నామని తెలపడమైనది . దానికి స్పందనగా ముఖ్యమంత్రి గ్రేట్ అని తెలియజేస్తూ శాలువా తో అభినందనలు తెలియజేసారు . ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేయడమైనది.

## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు పెద్ద కుమారుడు వివాహానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా విచ్చేసిన రాష్ట్ర ప్రియతమ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని హెలిపాడ్ వద్ద మర్యాద పూర్వకంగా కలుసుకునీ సాదర స్వాగతం పలికిన పార్వతీపురం నియోజకవర్గవ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

## ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్ళు



**విజయనగరం:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు ముమ్మరంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి ఒక ప్రకటన లో తెలిపారు. ధాన్యానికి మద్దతు ధర గత ఏడాది కంటే ఈ ఏడాది 100 రూపాయలు పెరగడమే కాకుండా అదనంగా రైతన్నకు ప్రభుత్వం అనేక అర్ధిక వెసలుబాటులను కల్పిస్తుండడం వలన రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని కలెక్టర్ తెలిపారు. చెల్లింపులను 21 రోజుల్లోనే అందించడం, రవాణా, గన్నీ సంచులకు, లేబర్ కు అయ్యే ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించడం తో రైతులు ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద శాంపిల్ సేకరణకు అవసరమగు సామగ్రిని , సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు . అంతే కాకుండా ధాన్యం సేకరణ కు అనుసరిస్తున్న ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఆర్.బి.కే లో ప్రదర్శించి రైతులకు అవగాహన కలించడం జరుగుతోందన్నారు.

ఈ ఏడాది ఇంతవరకు 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అందుకు గాను 6 కోట్ల రూపాయలను వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులను 10 రోజుల నుండి 21 రోజుల్లో రైతుకు అందజేయడం జరుగుతోందన్నారు. రైతులు కోసి కుప్పలుగా వేసిన వరి చేను ను త్వరగా నూర్పులు చేసి ఆర్.బి.కే లకు తరలించాలని ప్రకటన ద్వారా కోరారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది కొనుగోళ్ళు, చెల్లింపులు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు ఫిర్యాదుల కోసం జిల్లా స్థాయి లో కంట్రోల్ రూమ్ ను, టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేయడం జరుగుతోందని, అందుకు తగు యంత్రాంగాన్ని నియమించడం జరిగిందని స్పష్టం చేసారు. ఇప్పటి వరకు 383 ఆర్.బి.కే ల ద్వారా 4266 మంది రైతులకు 2208 కూపన్ లను ఉత్పత్తి చేసి 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు.

## సీఎస్‌తో కాకినాడ కలెక్టర్ వీడియో సమావేశం



కాకినాడ, (విశాఖ సమాచారమ్): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి.. గురువారం ఉదయం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా..జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. సీఎస్ జవహర్ రెడ్డి.. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన స్పందన అర్జీలు పరిష్కారం, గృహ నిర్మాణాలు, టిడ్కో ఇళ్లు, గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ మెరుగు, రీ సర్వే, శాశ్వత భవనాల నిర్మాణం, ధాన్యం కొనుగోలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ గోల్స్) తదితర అంశాలపై కలెక్టర్లతో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కమిషనర్ కె.రమేష్, సీపీవో పి.త్రినాథ్, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఎం.శాంతి ప్రభ, ఇంఛార్జ్ డీఈవో డానియేల్ రాజు, డీపీవో ఆర్.విక్టర్, గ్రామీణ నీటి సరఫరా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ముందస్తు ఎన్నికలు - తేల్చి చెప్పిన సజ్జల ?



ఏపీలో అన్ని పార్టీలు ఎన్నికల కసరత్తు మొదలు పెట్టాయి. టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీలో ముందస్తు ఎన్నికలు ఖాయమని చెబుతున్నారు. వచ్చే మే లేదా నవంబర్ లోనే ఏపీలో ఎన్నికలు జరిగేలా సీఎం జగన్ ఆలోచన చేస్తున్నారని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అటు సీఎం జగన్ నియోజకవర్గాల సమీక్షలు చేస్తున్నారు. ఎమ్మెల్యేల పని తీరు పైన హెచ్చరికలు చేస్తున్నారు. లోకేష్ వచ్చే నెలలో పాదయాత్ర ప్రారంభిస్తున్నారు. జనసేన అధినేత పవన్ తన ఎన్నికల ప్రచారం కోసం వాహనం సిద్ధం చేసుకున్నారు. దీంతో, ఏపీలో ముందస్తు ఖాయమని భావిస్తున్న వేళ..దీని పైన సజ్జల స్పష్టత ఇచ్చారు.

పథకాల లబ్ధిదారుల మధ్య సీఎం బర్త్ డే ఈ నెల 21న ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల నిర్వహణ పైన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి జగన్ 50వ పుట్టిన రోజు కావటంతో..కొంత భిన్నంగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇంత వరకు ఏ పార్టీ కూడా చేయునట్లు మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు 90 శాతానికి పైగా పూర్తి చేసిన నాయకుడు జగన్ అని ప్రశంసించారు. సామాజిక న్యాయాన్ని చేతుల్లో చూపించారని చెప్పుకొచ్చారు. అందుకే కోట్లాది మంది లబ్ధిదారులు కూడా పాల్గొనే విధంగా కార్యక్రమాలను రూపొందించామని సజ్జల వివరించారు.

ముందస్తు ఎన్నికలని చంద్రబాబు చెబుతారు టీడీపీ అధినేత చంద్రబాబు తాజాగా ఏపీలో ముందస్తు ఎన్నికల గురించి కీలక వ్యాఖ్యలు చేసారు. సీఎం జగన్ ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతున్నారని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది మే లేదా నవంబర్ లోనే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని పార్టీ నేతలకు చెప్పారు. దీని పైన స్పందించిన సజ్జల.. చంద్రబాబు ఎప్పుడూ ముందస్తు ఎన్నికలు అంటున్నారని ఎద్దేవా చేసారు. పార్టీలో ఊపులేక చంద్రబాబు ముందస్తు మాటలు చెబుతున్నారని విమర్శించారు. ముందస్తుకు వెళ్లాల్సిన అవసరం తమకు లేదని తేల్చి చెప్పారు. హామీలు అమలు చేసి ఐదేళ్లు పూర్తి అయ్యాక ప్రజలకు చెప్పి ఎన్నికలకు వెళ్తామని సజ్జల స్పష్టం చేసారు. పొత్తులు, ఎత్తులు లాంటి చచ్చు ఆలోచనలు తమకు ఉండవన్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం కోసం చంద్రబాబు మాయమాటలు చెప్తున్నారని సజ్జల పేర్కొన్నారు.

మెరుగైన విధానం ఉంటే పవన్ చెప్పవచ్చు అదే సమయంలో పవన్ కల్యాణ్ గురించి సజ్జల మాట్లాడారు. కౌలు రైతులకు సంబంధించి మెరుగైన విధానం ఏదైనా ఉంటే పవన్ చెప్పవచ్చన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం సహాయం అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఈ నెల 18న పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా సత్తెనపల్లి లో కౌలు రైతు భరోసా యాత్రలో పాల్గొంటున్నారు. చెక్కులు అందించనున్నారు. గతంలో తూర్పు గోదావరి..అనంతపురం జిల్లాల్లో ఇదే తరహా యాత్రలు నిర్వహించారు. ప్రభుత్వం కౌలు రైతులకు అండగా నిలుస్తోందని..ఇంకా ఏమైనా చేయాల్సి ఉంటే చెప్పవచ్చని సజ్జల పేర్కొన్నారు.

## కాకినాడలో ఘనంగా అమరజీవి వర్ధంతి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా పిలుపునిచ్చారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు భాష మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం చాలా గొప్పదని పేర్కొన్నారు. ఇలాంటి మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని.. వారి సేవలను స్మరించుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత గొప్ప వ్యక్తుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరేందుకు కృషిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కాకినాడ రామారావుపేట, సీబీఎం స్కూల్-ఫెలోషిప్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శాసనమండలి సభ్యులు చిక్కాల రామచంద్రరావు, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రేమ, నిస్వార్థంతో కూడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి, దేశంలో నెం.1 స్థానంలో రాష్ట్రాన్ని నిలిపేందుకు కృషిచేస్తున్నారని కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఫలితంగా 1953, అక్టోబరు 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆ తర్వాత హైదరాబాద్ రాజధానిగా 1956, నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.మయూరి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపిలో కాపు నేతల ఐక్యతా రాగం



**అమరావతి:**

ఏపీలో ఎన్నికల సీజన్ దగ్గరపడుతోంది. దాంతో పాటుగా రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ఏపీలో రాజకీయం అంటే పక్కా కులాల లెక్కలే. ఏపీలో సామాజిక సమీకరణలు తీసుకుంటే కాపులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా కాపుల మద్దతు అత్యవసరం. వారు తలచుకుంటేనే ముఖ్యమంత్రి పీఠం మీద ఎవరైనా కూర్చోనేది.ఇంకో వైపు చూస్తే కాపులకు చిరకాల కోరికగా సీఎం పదవి ఉంది. ఇపుడు కాలం కలసివస్తోంది. జనసేన పార్టీని పవన్ కళ్యాణ్ స్థాపించారు. నిజానికి 2019 ఎన్నికల నాటికే కాపులు పోలరైజ్ కావాలి కానీ అప్పటికి వైసీపీ వేవ్ బలంగా ఉంది జగన్ కి ఒక్క చాన్స్ ఇవ్వాలన్న ఆలోచన ప్రజలలో ఉంది. దాంతో జనసేనకు కాపులు అంతా గుత్తమొత్తంగా మద్దతు ఇవ్వలేకపోయారు.ఇపుడు చూస్తే ఏపీలో టీడీపీ వైసీపీ పాలన రెండూ చూశారు. దాంతో మూడవ ఆల్టర్నేషన్ గా జనసేన ఉంది. పైగా కాపులకు ఆశదీపంగా ఈ పార్టీ ఉంది. ప్రజారాజ్యం నాటి పొరపాట్లను తిరిగి చేయకుండా అంతా కలసి ఒక్కటిగా ఉంటే ఏపీలో కాపులకు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయగలమన్న కొత్త ఆలోచనలు వస్తున్నాయి. ఆనాడు ప్రజారాజ్యం పార్టీ కర్త కర్మ అన్నీ తానే అయి వ్యవహరించిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇపుడు కాపు నేతల వరస మీటింగుల వెనక ఉన్నారు.ఈ మీటింగులు హైదరాబాద్ విశాఖలలో జరిగాయి ఇపుడు విజయవాడలో జరిగింది. అది కూడా గంటా ఇంట్లో ఒక వైపు కాపునాడు మీటింగ్ ని రంగా వర్ధంతి రోజైన 26న విశాఖలో నిర్వహించడానికి గంటా తెర వెనక అన్ని రకాలుగా ఏర్పాట్లు చేశారు. తాజాగా పోస్టర్ ని రిలీజ్ చేశారు. ఇక ఆ పోస్టర్ మీద రంగాతో పాటు పవన్ చిరంజీవి బొమ్మలు ఉండడం కాపులకు సరికొత్త సంకేతంగా కనిపిస్తోంది.ఆనాడు రంగా ఆశించిన రాజ్యాధికారాన్ని సాధించుకోవడానికి ఈనాటికి దారి దొరికింది అన్నట్లుగా కాపునాడు సభ ఈ నెల 26న విశాఖలో చెప్పబోతోంది అని అంటున్నారు. ఇక విజయవాడలో గంటా ఇంట్లో జరిగిన కాపు నేతల మీటింగుకు మరో టీడీపీ నేత బోండా ఉమా బీజేపీ లీడర్ కన్నా లక్ష్మీనారాయణతో పాటు ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన ఎడం బాలాజీ కూడా హాజరయ్యారు.ఈ మీటింగులో అనేక కీలక విషయాలు చర్చించారు అని అంటున్నారు. ఈ నెల 26న జరిగే కాపునాడు కోసం కూడా ఈ మీటింగ్ జరిగింది అని చెబుతున్నారు. అంతే కాదు వచ్చే ఎన్నికల్లో జనసేనకు మద్దతు ఇచ్చేలా కూడా కాపు నాయకులు టర్న్ అవుతున్నారు అని చెబుతున్నారు. పార్టీలకు అతీతంగా కాపు నాయకులు అంతా జనసేన వైపు మొగ్గు చూపుతున్నారు అని అంటున్నారు. ఇక ఈ నెల 26న జరిగే కాపునాడు సభ ఏపీ రాజకీయాలను కీలకమైన మలుపు తిప్పుతుంది అని అంటున్నారు.ఈ సభ ద్వారా ఏపీలో కాపులు కొత్త డిమాండ్లు ముందుకు తెస్తారని రాజకీయంగా ఇప్పటికే కీలకంగా ఉంటున్న అధికార వైసీపీ ప్రతిపక్ష టీడీపీకి మింగుడు పడని విధంగానే కాపునాడు సభ తీర్మానాలు ఉండబోతున్నాయని అంటున్నారు. ఇక్కడ ఇంకో విషయం ఏమిటి అంటే తాజాగా కన్నా లక్ష్మీనారాయణను జనసేన నేత నాదెండ్ల మనోహర్ కలుసుకుని చర్చలు జరిపారు. దాంతో కాపు నేతలు చాలా మంది జనసేనలో చేరే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం మొదలైంది.ఇపుడు చూస్తే కాపునాడు సభను గంటా కనుసన్ననలో నిర్వహించడం ద్వారా కాపులను ఏకం చేసి జనసేన వైపు నడిపించాలి అన్న ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. దానికి నాందిగానే ఈ సభ అంటున్నారు. దానికి వంగవీటి మోహన రంగా కుమారుడు రాధా హాజరవుతారని కూడా తెలుస్తోంది. మొత్తానికి ఏపీలో కాపులు ఏదో సంచలనానికి తెరె తీసేలా ఉన్నారని అంటున్నారు. అవేంటి అన్నది చూడాలీ అంటే ఈ నెల 26 వరకూ ఆగాల్సిందే.

## ఢీ అంటే ఢీ: ఏపీలోకి కేసీఆర్... తెలంగాణలోకి చంద్రబాబు!

భారత రాష్ట్ర సమితి జాతీయ పార్టీగా గుర్తింపు పొందడానికి అవరమైన ఓట్ల శాతంలో కొంత ఏపీ నుంచి వస్తుందనే నమ్మకాన్ని, ఆశను కేసీఆర్ పెట్టుకున్నట్లే కనపడుతోంది. రాష్ట్రంలో తాను నేరుగా అడుగుపెట్టడం వేరు.. పార్టీ తరపున మనుషులను పంపించడం వేరని ఆయన భావిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజనకు కేసీఆర్ కారకుడని ఏపీ ప్రజలు ఆగ్రహంతో ఉండటమే అందుకు ప్రధాన కారణం.

**ఏపీ ఇన్ ఛార్జిగా తలసాని:** మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఏపీ కార్యక్రమాల ఇన్ ఛార్జిగా నియమించారు. తెలుగుదేశం పార్టీ నేతలతో తలసానికి బంధుత్వాలున్నాయి. యనమల రామకృష్ణుడు, పుట్టా సుధాకర్ యాదవ్ కు తలసానితో బంధుత్వం ఉంది. సంక్రాంతి తర్వాత ఏపీలో బహిరంగ సభ నిర్వహించాలని కేసీఆర్ తలపోస్తున్నారు. అందుకు కావల్సిన స్థల సేకరణ, పార్టీ కార్యాలయ నిర్మాణ బాధ్యతలు కూడా తలసానికే అప్పజెప్పారు. విజయవాడకు సమీపంలోని జక్కంపూడిలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని నిర్మించబోతున్నారు.

**బీఆర్ఎస్ ఎంత వేగంగా కదులుతుందో టీడీపీకి అంత మంచిది!** ఏపీలో బీఆర్ఎస్ కదలికలు ఎంత ఎక్కువగా ఉంటే తమకు అంతమంచిదని తెలుగుదేశం పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును సెంటిమెంట్ తో అడ్డుకుంటున్న కేసీఆర్ ఏపీలో కార్యకలాపాలు ప్రారంభిస్తే అంతకంటే వేగంగా చంద్రబాబు తెలంగాణ జిల్లాల్లోకి ప్రవేశించే అవకాశం కనపడుతోంది. ఏపీలో కేసీఆర్ ఉన్నారు కాబట్టి తెలంగాణలో తానుండటంవల్ల ఇరువురి మధ్య, ఇరుపార్టీల మధ్య ఈక్వేషన్ సరిపోతుందంటున్నారు. కేసీఆర్ తన బీఆర్ఎస్ ప్రణాళిక ప్రకటించిన వెంటనే చంద్రబాబునాయుడు చురుగ్గా వ్యవహరించారు. కాసాని జ్ఞానేశ్వర్ ను పార్టీ అధ్యక్షుడిగా చేశారు. ఆ తర్వాత పార్టీలో చేరికలు పెరుగుతున్నాయి. ఈనెల 21వ తేదీన ఖమ్మంలో భారీ బహిరంగసభను ఏర్పాటు చేయబోతున్నారు. కొంతమంది సీనియర్ నాయకులు కూడా తిరిగి టీడీపీలో చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**సరిహద్దులు పంచుకుంటున్న జిల్లాల్లో..** తెలుగుదేశం పార్టీకి బలమున్న ఖమ్మం, గ్రేటర్ హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో పోటీచేయడానికి దారులు ఏర్పడతాయి. మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాలు ఏపీతో సరిహద్దులు పంచుకుంటున్నాయి. ప్రస్తుత ఎన్నికలకు తనకు బలమున్నచోట్లే నిరూపించుకొని పోటీచేయాలని టీడీపీ ఆలోచన చేస్తోంది. ఎన్నికల ఫలితాలనుబట్టి తర్వాత పార్టీని మరింత విస్తరించే అవకాశం ఉందంటున్నారు. ఏమైనాకానీ కేసీఆర్ అటు ఏపీలో, చంద్రబాబు ఇటు తెలంగాణలో అడుగు పెట్టనుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

## సాలార్ జంగ్ మ్యూజియం ప్రారంభ దినోత్సవం (డిసెంబర్ 16)



సాలార్ జంగ్ మ్యూజియం - నాటి ప్రధాని నెహ్రు చేత డిసెంబర్ 16, 1951 న ప్రారంభింపబడింది. దేశంలో మూడవ పెద్ద మ్యూజియం గా గుర్తింపు పొందింది. 1968లో ఇప్పుడున్న భవనాలలోనికి మ్యూజియాన్ని మార్చారు. నిజాం నవాబు వద్ద ప్రధానిగా పనిచేసిన మీర్ తురబ్ అలీఖాన్ కు పురాతన వస్తువులు సేకరించే అలవాటు ఉండేది. 'సాలార్ జంగ్' అనేది నిజాం నవాబు వీరికిచ్చిన బిరుదు. ఈయన కుమారుడైన మీర్ లాయక్ అలీఖాన్, మనువడైన మీర్ యూసఫ్ అలీఖాన్ లు కూడా పురాతన వస్తువులను సేకరించారు. వీరు ముగ్గురూ ప్రధానులుగా పని చేశారు. వీరిలో చివరి వ్యక్తి నవాబ్ మీర్ యూసఫ్ అలీఖాన్ (మూడవ సాలార్ జంగ్) అత్యధిక సంఖ్యలో సేకరించారు. వీరు 1889 జూన్ 3న జన్మించారు. ఈయన వివాహం కూడా చేసుకోకుండా పురాతన వస్తువుల సేకరణకు తన జీవితాన్ని అంకితం చేసాడు. వీరు మార్చి 2, 1949 లో మరణించారు. తన నివాసమైన 'దివాన్ దేవిడి' లోనే ప్రజలకోసం ప్రదర్శిస్తుండేవారు. వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మ్యూజియం ఏర్పాటుచేసింది. దీనిలో 40 దేశాల నుంచి సేకరించిన 44 వేల కళా ఖండాలు ఉన్నాయి. వీటిలో ఇటలీ శిల్పి బొంజో సృష్టించిన మేలి ముసుగు ధరించిన పాలరాతి శిల్పం 'రెబెకా', 19వ శతాబ్దం నాటి బ్రిటిష్ మ్యూజికల్ క్లాక్ మొదలైనవెన్నో ఉన్నాయి. ఈ మ్యూజియం ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతూ హైదరాబాద్ నగరంలో చూడదగ్గ ప్రముఖ ప్రదేశంగా మారిపోయింది. సాలార్ జంగ్ భౌతికంగా మరణించినా, మ్యూజియం ద్వారా కలకాలం జీవించే ఉంటారు.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**పైడిమెట్ట 9490833108.**

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేషకృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.మహాత్మాగాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేసిన మహనీయుడు శ్రీరాములు అని అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న మహొన్నతుడు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకట రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, డిప్యూటీ డి ఎమ్ అండ్ హెచ్ ఓ దుర్గా కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసిలో ఉచిత డెంటల్ క్యాంప్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గీతం కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ క్యాంపైన్ నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో జివిఎంసి అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి పర్యవేక్షణలో గీతం కాలేజీ డెంటల్ వైద్య బృందం జివిఎంసిలోని 85 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారని అదనపు కమిషనర్లు తెలియజేశారు. ఈ పరీక్షలలో డాక్టర్ల బృందం సిబ్బంది యొక్క పళ్ళను పరీక్షించి వారికి పళ్ళు యొక్క ఉపయోగాలు, వాటిని శుభ్రం చేసుకునే పద్ధతితో పాటు సూచనలు, సలహాలు ఇచ్చారు. పళ్ళు ముఖ్యంగా మనం తినే ఆహారాన్ని నమిలేందుకు ఎంతో ఉపయోగపడతాయని, కొంత మంది పళ్ళు పాడయినందున వారికి రూట్ కెనాల్, పళ్ళుకు క్యాప్ అమర్చడం, పళ్ళు కట్టడం, పసుపు రంగుగా మారిన పళ్ళును శుభ్రపరచడం గీతం కాలేజీలో వైద్యం చేయబడునని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గీతం కాలేజీ డాక్టర్లు మనీష కుమార్, ఓవియా, చైతన్య, ఇషికా, జివిఎంసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అజరామరం



**విజయనగరం:** ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన, పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అజరామరమని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో, గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. తెలుగువారి కోసం ప్రాణాలు వదిలిన పొట్టి శ్రీరాములు, తెలుగుజాతి ఉన్నంత వరకు అమరజీవిగా నిలుస్తారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, సిపిఓ పి.బాలాజీ, స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ బి.పద్మావతి, పంచాయితీరాజ్ ఎస్ఇ బిఎస్ఆర్ గుప్త, జిల్లా పర్యాటకాధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, జిల్లా బిసి సంక్షేమాధికారి యశోధనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు కు వ్యతిరేకంగా పోరాడాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పనిబారం పెంచి సెక్యులర్లను విడుదల చేస్తు చిరు ఉద్యోగులపై దాడుల్ని ఖండిస్తున్న సిపిఎం ప్రభుత్వ కార్మిక ,ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా పోరాడాలని పార్వతీపురం మన్యం జిల్లాసి పి యం కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు.ముక్కువ మండలంలో ఆత్మహత్య చేసుకున్న వీఆర్వోజ కుటుంబాన్ని ఆదుకోవాలి.నిన్ను జరిగిన జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు సమస్యలు ఏవి లేనట్టు కార్మిక, ఉద్యోగులపై వేధింపులో భాగంగా సర్కిలర్లు, మెమోలు జారీ చేయడం సరేంది కాదని వీటిని రద్దు చేయాలని సిపిఎం కోరింది.మొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం దాడి నేడు చిరుద్యోగులపై సర్కారు పని భారం పెంచ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్మిక వ్యతిరేక వైఖరిని చాటుకుంటుంది ఈ వైఖరిని ఖండించిన సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా కమిటీ కార్యదర్శి రెడ్డి వేణు. పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బంటు దాసు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వై సి పి ప్రభుత్వం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** 144వ రోజున 51వ సచివాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో అంటిపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురూవారం నాడు పార్వతీపురం నియోజకవర్గం, సీతానగరం మండలం, అంటిపేట సచివాలయం పరిధిలో గల అదే గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించడం జరుగురుంది. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి పంచాయతీ సర్పంచ్ సిరికి మహేష్, ఉప సర్పంచ్ బి తిరుపతి రావు, ఎంపీటీసీ సభ్యులు ఎస్ నిర్మల, ఎక్స్ జెడ్పీటీసీ అంబటి కృష్ణం నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు డి దానబాబు, స్టేట్ డైరెక్టర్ ఎస్ తిరుపతిరావు, గ్రామ పెద్దలు అంతా కలిసి గ్రామంలో ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం గ్రామంలో గల ప్రధాన వీధి వద్ద నుంచి ఎమ్మెల్యే గారు గడప గడపకు కార్యక్రమాన్ని ప్రారంభించి అన్ని వీధులలో గల గడప గడపకు వెళ్లి ప్రజలను వారి గడప వద్దనే కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన బుక్లెట్లను వారికి అందచేసి వారు ప్రభుత్వము నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు అన్నీ సవ్యంగా అందుతున్నదే లేనిదీ అడిగి తెలుసుకుని వారికి అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందలేకుంటే వాటి వివరాలును అడిగి మరీ తెలుసుకుని మండలం మరియు సచివాలయం ఉద్యోగులచే అక్కడికి అక్కడే నమోదు చేయించి వారికి ఉన్న అర్హతమెరకు వచ్చే ముందు నెలలో వారికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అదేవిధంగా గ్రామంలో గల సమస్యలను సహితం తెలుసుకుని వాటి పరిష్కారానికి పూర్తి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రతీ ఇంటికీ ప్రతీ ఒక్కరికీ సహాయం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ మరొక సరి సీఎం గా ఆశీర్వదించి దీవించాలి అని గడప గడపణ ఎమ్మెల్యే ప్రజలను కోరుతూ వారి వద్ద నుంచి పెద్ద యెత్తున ఆశీస్సులు స్వీకరించడం జరుగుతున్నది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మండల జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, బలగ శ్రీరాములు నాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, టి వెంకట అప్పల నాయుడు, ఆర్వీ, ఎస్ రామకృష్ణ,కే రత్నాకర్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు ఎస్ కిరణ్ కుమార్, కే రమణ, జీ బుజ్జి, సర్పంచ్లు మద్రాపు ధనుంజయ్ నాయుడు, జీ అన్నం నాయుడు, అల్లు తిరుపతి నాయుడు, అధికారి నారాయణరావు, బలగ శ్రీనివాసరావు, జీ అప్పారావు, టి రామారావు, బి తిరుపతిరావు, రాధాకృష్ణ, బి శ్రీహరి, వై వెంకట నాయుడు, బి భాస్కరరావు, పి తిరుపతిరావు, పి శ్రీనివాసరావు, సిహెచ్ కృష్ణ, బి ఉమామహేశ్వరరావు, వైసీపీ నాయకులు డి సింహాచలం, డి నాగరత్నం, బి సత్యన్నారాయణ, వై సివునాయుడు, వై రాధాకృష్ణ, బి జగన్నాధం, పి బలరాం, సురేష్, నాయుడు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్య రక్షణ అవసరం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. దుర్గా కళ్యాణి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం హెమోగ్లోబిన్ పరీక్షలను వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హెమోగ్లోబిన్ పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గా కళ్యాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ హెమోగ్లోబిన్ పరీక్షలు అవసరమన్నారు. హెమోగ్లోబిన్ వలన ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందని జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. హెమోగ్లోబిన్ మెరుగు పరుచుటకు గుడ్లు, మాంసాహారం, కేరట్, పచ్చని ఆకుకూరలు, బఠాణీ, చిక్కుడు గింజలు వంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి కె. విజయ గౌరి, రక్త నిధి వైద్యులు డా.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశాల పోస్టుల కుదింపు అమానుషం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** :ఆశాల పట్ల రాష్ట్ర జగన్ ప్రభుత్వం కపట మోషం ప్రదర్శించిందని ఇది చాలా అమానుషమని 200 మంది ప్రజానీకానికి ఒక వాలంటరీని నియమించిన ప్రభుత్వం, 2500 మంది ప్రజానీకానికి ఒక ఆశా వర్కర్ ఏ విధంగా వైద్య సేవలు అందిస్తుందో రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలని ఈ నిర్ణయం ఆశా వర్కర్ల పోస్టులు గుర్తింపుతో పాటు, వారందించే వైద్య సేవల పైన తీవ్ర ప్రభావం చూపుతోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా, సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.కృష్ణవేణి, ఎం.గౌరీ అన్నారు. గురువారం పత్రికలలో సంచలనమైన ఆశ పోస్టులకు కుదింపు వార్తలను తీవ్రంగా ఖండిస్తూ పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు అనుబంధం ) నాయకులు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్థిక భారం తగ్గించుకునే పేరుతో ఆశా వర్కర్ల పోస్టను కుదించాలనే ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదని, ఇప్పటివరకు 800 మంది జనాభా కు ఒక ఆశ వర్కర్ మాత్రమే వైద్య సేవలు అందించే వారిని ఇకపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ జనాభా సంఖ్యను 2500 పెంచడం వైద్య సేవకులపై తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురి చేయడమేనని ఇది చాలా దుర్మార్గమని వాపోయారు. పాదయాత్ర సందర్భంలో వైద్య సేవలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలియజేసిన జగన్మోహన్ రెడ్డి నేడు జనాభా ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టులను పెంచాల్సి ఉంది. కాని, ఉన్న పోస్టులను పెరిగిన జనాభాకు అనుగుణంగా కుదించడం చాలా అమానుషమని మండిపడ్డారు. ప్రభుత్వ సేవలు అందించడానికి, ఓట్ల చేర్పింపు లెక్కింపులకు ప్రతి 50 కుటుంబాలలో ఉన్న 200 మంది ప్రజానీకానికి ఒక వాలంటరీ నియమించినప్పుడు, ఒక్క ఆశ వర్కర్ 2500 మంది ప్రజానీకానికి వైద్య సేవలకు వైద్య సేవలు అందించడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. కరోనా సమయంలో కూడా మహమ్మారిని ఎదిరించి కొండ గిరిజన ప్రాంతాలలో అనేక సందర్భాల్లో కూడా సేవలు అందించిన ఘనత ఆశ వర్కర్లకు ఉందని అటువంటి వారిపట్ల రాష్ట్ర ప్రభుత్వం ఈ కుదింపు నిర్ణయం ప్రక్రియ అనుసరించడం చాలా దౌర్భాగ్యం అని దీనిని బట్టి వైద్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంత శ్రద్ధ వహించిందో స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రులు పునరాలోచించి కుదింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే రోగాన్ని నివారించినట్టు ప్రభుత్వాన్ని కూడా నివారించగలమని హెచ్చరించారు.

# హై రిస్క్ గర్భిణీలను గుర్తించాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ప్రసవానికి ఏడు రోజులు ముందుగా హై రిస్క్ ఉన్న గర్భిణీలను గ్రామాల్లో గుర్తించి జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలు, పాఠశాలల్లో ఉన్న 10 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత లోపం లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. హై రిస్క్ ఉన్న రోగులను గుర్తించి జిల్లా ఆసుపత్రికి తరలించాలని అన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పం క్రింద గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు ఇంటింటికీ చెత్త సేకరణ రోజువారీగా తప్పకుండా జరగాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. క్లాప్ మిత్రా జీతభత్యాలు సకాలంలో చెల్లించాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకట రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, డిప్యూటీ డి ఎమ్ అండ్ హెచ్ ఓ దుర్గా కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 8187897569



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగంలో అధికంగా వస్తున్న ఫిర్యాదులు నేపథ్యంలో జివిఎంసి కమిషనర్ పి. రాజాబాబు టౌన్ ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో డిసిపిలు, ఏసీపీలు టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ స్పందన కార్యక్రమంలో 12 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జివిఎంసి పరిధిలో ఎలాంటి అనాధికార నిర్మాణాలు జరుగుతున్న, నిబంధనల ఉల్లంఘించి భవనాలు నిర్మించిన, భవన నిర్మాణ వ్యర్థాలపై, టౌన్ ప్లానింగ్ విభాగం పై ఎలాంటి ఫిర్యాదులనైనా ప్రత్యేక టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామని ఈ ఫోన్ నెంబర్ కు 8187897569 ఫిర్యాదులు ప్రతి రోజూ నేరుగా తమ సమస్యను తెలియజేయవచ్చునని కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వచ్చిన ఫిర్యాదులను దిగువ స్థాయి సిబ్బంది నుండి పై అధికారి వరకు వివరణ అడిగి తెలుసుకొని వచ్చిన ఆర్జీని తక్షణమే పరిష్కారమయ్యే విధంగా చూడాలని చీఫ్ సిటీ ప్లానర్ ని ఆదేశించారు.

# అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



**విజయనగరం:** అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. తెలుగు జాతి కోసం, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అప్పటివరకు మద్రాసీలుగా పిలవబడ్డ తెలుగువారికి ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని, తద్వారా తెలుగు జాతికి ఒక గుర్తింపును, గౌరవాన్ని పొట్టి శ్రీరాములు సముపార్జించారని అన్నారు. సుమారు 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి, మొక్కవోని పోరాటపటిమతో, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. దురదృష్టవశాత్తూ ఆయన దీక్షలోనే తన అమూల్యమైన ప్రాణాలను విడిచిపెట్టినప్పటికీ, తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన ఖ్యాతి నిలిచిఉంటుందని ఛైర్మన్ శ్రీనివాసరావు అన్నారు.

ఈ కార్యక్రమంలో జెడ్పి డిప్యుటీ సిఇఓ కె.రాజ్‌కుమార్, జిల్లా పంచాయితీ అధికారి నిర్మలాదేవి, జెడ్‌పి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జుట్టు ఎక్కువగా రాలుతోందా..? ఈ బ్లడ్ టెస్ట్‌లు కచ్చితంగా చేయించుకోవాలి..!



జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా, షైనీగా ఉండాలని అందరూ కోరుకుంటారు. కానీ, కొంతమంది తీవ్రమైన హెయిర్ ఫాల్‌తో బాధపడుతూ ఉంటారు. జుట్టు రాలడాన్ని కంట్రోల్ చేయడానికి.. ఏవేవో ప్యాక్‌లు వేస్తూ ఉంటారు. అయినా రిజల్ట్ కనిపించవు. జుట్టుకు పైపైన ఎన్ని లేపనాలు పూసినా.. శరీరంలో కొన్ని పోషకాలు లోపిస్తే జుట్టు రాలుతూనే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో కొన్ని విటమిన్లు, మినరల్స్ లోపించడం వల్ల జుట్టు రాలడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయని న్యూట్రీషనిస్ట్, ఫిట్‌నెస్ నిపుణురాలు డాక్టర్ రీమా అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి వాటి మూలాలు గుర్తించడం చాలా అవసరమని అన్నారు. దీనికి 6 రక్త పరీక్షలు సహాయపడతాయని చెప్పారు.

**సీబీసీ :** సీబీసీ పరీక్షలో ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్స్ మొదలైనవాటిని పరిశీలిస్తారు. వీటిలో ఏదైనా లోపం ఉంటే జుట్టు రాలడం, క్యాన్సర్‌కు కారణమయ్యే అవకాశం ఉంది. ఎర్ర రక్త కణాలు శరీరంంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్, పోషణను అందించడానికి సహాయపడతాయి. రెడ్ బ్లెడ్ సెల్స్ లోపం కారణంగా.. శరీరం బలహీన పడుతుంది.

**విటమిన్ డీ..** శరీరంలో విటమిన్ డి స్థాయిని గుర్తించడానికి.. విటమిన్ డీ బ్లడ్ టెస్ట్ సహాయపడుతుంది. పబ్మెడ్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. శరీరంలో విటమిన్ డీ లోపం ఉంటే.. జుట్టు రాలడం, ఆస్టియోపోరసిస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆరోగ్యకరమైన ఎముకలు, జుట్టు కోసం విటమిన్ డీ అవసరం.

**విటమిన్ B12 టెస్ట్..** మన శరీరంలో విటమిన్ B12 స్థాయిని చూడటానికి ఈ టెస్ట్ చేస్తారు. ఎర్ర రక్త కణాలు ఏర్పడటానికి ఈ విటమిన్ చాలా అవసరం. విటమిన్ B12 లోపం తక్కువ ఎర్ర రక్త కణాలు, తక్కువ హిమోగ్లోబిన్ లక్షణాలకు దారితీస్తుందని సూచిస్తుంది.

**ఐరన్ ప్రొఫైల్ టెస్ట్..** ఐరన్ ప్రొఫైల్ పరీక్ష రక్తంలో సీరం ఐరన్, ఫెర్రిటిన్, TIBC స్థాయిలను గుర్తిస్తుంది. రక్తంలో ఐరన్ లోపం వల్ల బలహీనత, విపరీతమైన అలసట, తలనొప్పి, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. మన శరీరంలో ఐరన్ సీరం స్థాయిలు తక్కువగా ఉంటే.. జుట్టు కుదుళ్లు బలహీనపడతాయని.. స్పష్టం చేసింది.

**థైరాయిడ్ ప్రొఫైల్ టెస్ట్..** థైరాయిడ్ ప్రొఫైల్ టెస్ట్ T3, T4, TSH పనితీరును కొలిచే రక్త పరీక్ష. ఈ హార్మోన్లలో పెరుగుదల, తగ్గుదల థైరాయిడ్‌ను మరింత దిగజార్చుతుంది. జుట్టు ఎక్కువగా రాలుతుంది. బరువు పెరగడం, నిద్రలేమి, అలసట వంటి సమస్యలు ఎదురవుతాయి.

**హార్మోన్ టెస్ట్..** అనేక ఇతర హార్మోన్లు మహిళల్లో జుట్టు రాలడంతో సహా ఇతర వ్యాధులకు కూడా కారణమవుతాయి. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రోలాక్టిన్, DHEA, టెస్టోస్టెరాన్, FSH, LH హార్మోన్ల పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రీమా అన్నారు.

# శీతాకాలం కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయా..? అయితే ఈ ఆహారం తినండి



శీతాకాలం కీళ్ల నొప్పులు ఇంకా ఎక్కువగా బాధిస్తాయి. వణికించే చలి, బిగుసుకుపోయిన కీళ్ల కారణంగా.. కూర్చుని లేవలేని పరిస్థితి ఉంటుంది. కీళ్లు బిగుసుకుపోవటం వల్ల ఉదయం పూట మంచం దిగటం కూడా కష్టంగా మారుతుంది. వాతావరణాల్లో గాలి ఒత్తిడి మార్పులు కీళ్ల నొప్పులను ట్రిగ్గర్ చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. శరీరం చుట్టుపక్కల గాలి ఒత్తిడి తక్కువగా ఉన్నప్పుడు కీళ్ల చుట్టూరా కండరాలు, కండర బంధనాలు, ఇతర కణజాలాలు ఎక్స్‌ప్యాండ్ అవుతాయి. ఇది కీళ్ల మీద ఒత్తిడిని పెంచుతుంది. ఆర్థరైటిస్ పేషెంట్స్, వృద్ధులు చలికాలంలో కీళ్ల నొప్పులు మరింత తీవ్రంగా ఉన్నట్లు కంప్లైంట్ చేస్తారు. చలికాలానికి అనుగుణంగా.. ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే కీళ్ల నొప్పుల నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు.

**ఫ్యాటీ ఫిష్..** సాల్మన్, మాకెరెల్ వంటి కొవ్వు చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి. వీటికి యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మెండుగా ఉంటాయి. ఇది కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. కీళ్ల నొప్పులతో బాధపడే వారు శీతాకాలం వారి డైట్‌లో ఫ్యాటీ ఫిష్ ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

**సోయాబీన్..** మీరు వెజిటేరియన్స్ అయితే.. మీ డైట్‌లో ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ చేర్చుకోవాలంటే.. సోయాబీన్స్ బెస్ట్ ఆప్షన్. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి.. సోయా మంచి ఆహారం. ఇందులో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్ శరీరంలో ఇన్ఫ్లమేషన్ తగ్గిస్తుంది. దీంతో, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**వెల్లుల్లి..** వెల్లుల్లి శరీరంలో కాల్షియం శోషణను ప్రోత్సహిస్తుంది. దీని వల్ల ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటాయి. ఆస్టియోపోరసిస్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. శీతాకాలంలో మన ఆహారంలో వెల్లుల్లి ఎక్కువగా చేర్చుకుంటే.. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వెల్లుల్లి డయల్ డైసల్ఫైడ్ అనే సమ్మేళనం ఉంటుంది, దీనికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మెండుగా ఉంటాయి. ఇది శరీరంలో మంటతో పోరాడానికి సహాయపడుతుంది. నొప్పిని తగ్గించడానికి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తోడ్పడుతుంది.

**అల్లం..** అల్లంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, అనాల్జేసిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. శీతాకాలం అల్లం మన డైట్‌లో తరచుగా తీసుకుంటే.. కీళ్ల వాపు నుంచి ఉపశమనం పొందవచ్చు.

**ఆలివ్ ఆయిల్..** ఆలివ్ నూనెలో ఒలియోకాథల్ ఉంటుంది. ఇది వాపు నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. వంటలో, సలాడ్ డ్రెస్సింగ్‌లో ఆలివ్ నూనె ఉపయోగించడం వల్ల వల్ల కీళ్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

# దానిమ్మ తొక్కలు.. మీ బ్రెయిన్‌ను కంప్యూటర్ కంటే స్పీడ్‌గా మారుస్తాయ్..!



దానిమ్మ తొక్కలను తీసుకునే వ్యక్తుల మెదడు బాగా పనిచేస్తుందని పబ్మెడ్ పరిశోధనలో తేలింది. దానిమ్మ తొక్కలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడి వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. తరచుగా దానిమ్మ తొక్కల టీ తాగితే.. మెదడు చురుకుగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ముందుగా 3-4 రోజులు ఎండలో ఎండబెట్టిన దానిమ్మ తొక్కలను తీసుకోండి. వాటిని మెత్తగా మెత్తగా పొడి చేయండి. ఇప్పుడు ఖాళీ టీ బ్యాగ్‌లో దానిమ్మ తొక్కల పొడిని వేయండి. తర్వాత ఒక కప్పు గోరువెచ్చని నీటిని తీసుకుని సాధారణ టీ బ్యాగ్‌లా దానిలో డిప్ చేయండి.

ఇలా కూడా తయారు చేసుకోవచ్చు..

దానిమ్మ తొక్కల పొడిని ఒక కప్పు నీటిలో వేసి మరిగించాలి. నీరు సగం అయ్యే వరకు మరిగించండి. ఆ తర్వాత టీని ఫిల్టర్ చేయండి. టీ గోరువెచ్చగా అయిన తర్వాత, తాగండి.

**పౌడర్ ఇలా రెడీ చేయండి..** దానిమ్మ తొక్కలను ఎండలో ఆరబెట్టడానికి సమయం లేకపోతే, మీరు వాటిని ఓవెన్‌లో కూడా ఆరబెట్టవచ్చు. మీరు చేయాల్సిందల్లా దానిమ్మ తొక్కలను ఒక ప్లేట్‌లో ఉంచి ఓవెన్‌లో 350 డిగ్రీల (180 సెల్సియస్) వద్ద 20 నిమిషాలు ఉంచండి. అవి బయటకు తీసి, చల్లారిన తర్వాత పొడి చేసి స్టోర్ చేసుకోండి.

**ఈ సమస్యలూ దూరం అవుతాయి..**

గొంతు నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. దగ్గును తగ్గుతుంది. కడుపులో సమస్యల నుంచి ఉపశమనం ఇస్తుంది. ఎముకలు స్ట్రాంగ్ అవుతాయి. మొటిమలు, వాటి మచ్చలు మాయం అవుతాయి. ముడతలు తొలగుతాయి.

నిగనిగలాడే.. దానిమ్మ గింజలను చాలా ఇష్టంగా తింటూ ఉంటారు. దానిమ్మలోని పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పండులో.. దానిమ్మలో పొటాషియం, క్యాల్షియం లాంటి మినరల్‌తోపాటు పీచూ తగినంత మొత్తంలో ఉంటుంది. అలాగే విటమిన్-సి, కె, బి, ఎ పుష్కలంగా ఉంటాయి. దానిమ్మలోని పోషకాలు గుండె సమస్యలు, హైపర్‌టెన్షన్, క్యాన్సర్, డయాబెటిస్ వంటి సమస్యలను దూరంగా ఉంచుతుంది. దానిమ్మ రసంలో కొవ్వును కరిగించే ప్యూనిక్ కొల్లాజెన్, ప్యూనిక్ యాసిడ్ ఉంటాయి. ఈ రసాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే కొవ్వు కరుగుతుంది. దానిమ్మలో గింజల్లోనే కాదు.. దానిమ్మ తొక్కలోనూ అనేక పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ తొక్కల్లో ఫినోలిక్ యాసిడ్స్, ఫ్లేవనాయిడ్లు, హైడ్రోలైజబుల్ టానిన్‌లు, పొటాషియం, కాల్షియం, ప్రోటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్‌లు మెండుగా ఉంటాయి. ఇవి బ్రెయిన్ షార్ప్‌గా ఉండటానికి ఈ పోషకాలు చాలా ముఖ్యం.

ఆక్సీకరణ ఒత్తిడి కారణంగా.. మెదడు క్రమక్రమంగా తన సామర్థ్యాన్ని కోల్పోతుంది.ఇది మతిమరపు, అల్జీమర్స్, డిమెన్షియా వంటి సమస్యలకు దారితీస్తుంది.

## జొన్నలతో తయారైన ఈ ఫుడ్ షుగర్ ఉన్నవారికి మంచిదట..



ఈ వంటకం చాలా టేస్టీగా ఉంటుంది. మీరు దీనిని చేసేందుకు ఉప్పు, మిరియాలు, ఎండుమిర్చి, పాక్, నిమ్మరసం, ఉల్లిపాయ, టమాట, పచ్చిమిర్చి, చాట్ మసాలా, చటపట్ చట్నీని మిక్సింగ్ గిన్నెలో కలపాలి. కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ స్నాక్ నవంబర్, ఫిబ్రవరి నెలల్లో అందుబాటులో ఉంటుంది. తాజాగా పండించిన జొన్న గింజలతో తయారు చేసిన ఈ ఫుడ్ ఇండియన్ గ్లూటెన్ రహిత ధాన్యంతో చేస్తారు కాబట్టి. బెనిఫిట్స్‌ని కలిగి ఉంటుంది.

**బరువు తగ్గడం..** చెడు కొలెస్ట్రాల్‌ని కూడా తగ్గించడంలో కూడా ఈ ఫుడ్ బాగా పనిచేస్తుంది. గుండెజబ్బులు, హై బ్లడ్ ప్రెజర్ ఉన్నవారికి చాలా మంచిది.

డైటరీ ఫైబర్‌కి గొప్ప మూలమైన ఈ ఫుడ్ ఎక్కువ సమయం నిండుగా ఉండేలా చేస్తుంది. అదనంగా ఉన్న బరువుని తగ్గిస్తుంది.

**డయాబెటీస్ దూరం..** ఇది ఫైబర్‌తో నిండి ప్రేగులను బలంగా చేస్తుంది. శరీరంలోని జీర్ణక్రియను సజావుగా చేసేందుకు సాయపడుతుంది. ఇది ఊబకాయాన్ని కూడా కంట్రోల్ చేస్తుంది.

కార్బోహైడ్రేట్స్‌కి మూలమైన ఈ వంటకం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచదు. కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారికి కూడా చాలా మంచిది.

**బెనిఫిట్స్..** ఇది ప్రోటీన్, ఫైబర్ రిచ్ సీజనల్ ట్రీట్. ఇది కండరాలను నిర్మించడంలో, శరీరంలోని కణాలను పునరుత్పత్తి చేయడంలో సాయపడుతుంది. ఇది కాల్షియం, రాగి, జింక్, ఐరన్, విటమిన్స్ బి1, బి2, బీ5, బి6తో పాటు అవసరమైన విటమిన్స్, ఖనిజాలు, యంటీ ఆక్సిడెంట్స్ కలిగి ఉంటుంది.

**గుండె సమస్యలు దూరం..** యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉన్నాయి. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని నియంత్రించడంలో సాయపడుతుంది. మధుమేహం, గుండె సమస్యలు, క్యాన్సర్స్ నుండి శరీరాన్ని కాపాడుతుంది.

జొన్న పిండితో తయారైన ఈ గ్లూటెన్ లెస్ ఫుడ్ మంచి స్నాక్ ఐటెమ్.

# మీ కిడ్నీ ఆరోగ్యంగా ఉండాలంటే ఇకపై మీకు తెలియకుండా ఇవి తినకండి...!



మీ మూత్రపిండాలు చాలా ముఖ్యమైన పనులను నిర్వహిస్తాయి. అవి మీ శరీరంలోని ద్రవం మొత్తాన్ని నియంత్రిస్తాయి. ఇవి ముఖ్యంగా మీ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. మీ మూత్రపిండాలు మీ రక్తం నుండి ప్రోటీన్ మరియు ఖనిజాలను ఫిల్టర్ చేస్తాయి. అనారోగ్య మూత్రపిండాలు మీ రక్తాన్ని పేలవంగా ఫిల్టర్ చేస్తాయి.

మీ రక్తపోటు మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం వలన మీ మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. కొన్ని ఆహారాలను నివారించడం లేదా పరిమితం చేయడం ద్వారా మీ ఆహారాన్ని మార్చుకోవడం వలన మీ మూత్రపిండాలు మరింత దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. ఈ పోస్ట్ లో మీరు తినే ఆహారాలు మీ కిడ్నీలను దెబ్బతీస్తాయో తెలుసుకోవచ్చు.

ఎరుపు మాంసం రెడ్ మీట్ లో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. మీ శరీరానికి ఆరోగ్యంగా ఉండటానికి మరియు నయం కావడానికి కొంత ప్రోటీన్ అవసరం అయినప్పటికీ, అధిక ప్రోటీన్ మీ మూత్రపిండాల పనితీరును మరింత దిగజార్చవచ్చు.

వెన్నలో సంతృప్త కొవ్వు ఉంటుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ ప్రకారం, కిడ్నీ వ్యాధికి గుండె జబ్బులు ప్రధాన ప్రమాద కారకం మరియు దీనికి విరుద్ధంగా. సంతృప్త కొవ్వు తీసుకోవడం మరియు గుండె మరియు మూత్రపిండాల వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడానికి తక్కువ వెన్న మరియు పందికొవ్వును తినండి.

వేరుశెనగలో ఆక్సలేట్‌లు ఉంటాయి, మూత్రపిండాల్లో రాళ్లలో ఉండే ఒక రకమైన ఖనిజం. వాస్తవానికి, నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ ప్రకారం, కాల్షియం ఆక్సలేట్ మూత్రపిండాల్లో రాళ్ల నిర్మాణానికి ప్రధాన కారణం. మీరు ఇంతకు ముందు కాల్షియం ఆక్సలేట్ కిడ్నీ స్టోన్‌ని కలిగి ఉన్నట్లయితే, ఆక్సలేట్‌లను కలిగి ఉన్న ఆహారాన్ని మీ తీసుకోవడం పరిమితం చేయడం వలన మరొక రాయిని అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

స్టఫ్డ్ కూరగాయలు కూరగాయలు మీకు చాలా మంచివి అయినప్పటికీ, తయారుగా ఉన్న కూరగాయలలో సాధారణంగా సోడియం ఎక్కువగా ఉంటుంది. మీ శరీరంలో ఎక్కువ సోడియం మీ రక్తప్రవాహం నుండి అదనపు ద్రవాన్ని తొలగించడానికి మీ మూత్రపిండాలకు కష్టతరం చేస్తుంది. వీలైనంత ఎక్కువ తాజా కూరగాయలు తినడం అలవాటు చేసుకోండి. లేకపోతే, మీరు ఉడికించే ముందు కూరగాయలను నీటిలో కడగాలి.

ప్రాసెస్ చేసిన మాంసాలు ప్రాసెస్ చేయబడిన మాంసాలలో గణనీయమైన మొత్తంలో సోడియం మరియు ప్రోటీన్లు ఉంటాయి, ఈ రెండూ మీ కిడ్నీలను అనారోగ్యానికి గురి చేస్తాయి. తాజా మాంసాహారం మాత్రమే తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

అవకాడో అవకాడోలో పొటాషియం ఉంటుంది, ఇది నరాల మరియు కండరాల పనితీరును నియంత్రిస్తుంది. పొటాషియం మీ గుండెను సాధారణ బీట్‌ని నిర్వహించడానికి సహాయపడుతుంది మరియు ద్రవాలు, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ మరియు %జూం% స్థాయిలను నిర్వహించడానికి ఇది అవసరం. రక్తంలో అధిక పొటాషియం, హైపర్‌కలేమియా అని పిలువబడే ఒక పరిస్థితి, తరచుగా మూత్రపిండ వ్యాధి యొక్క అధునాతన దశలలో ఉన్న వ్యక్తులలో సంభవిస్తుంది. హైపర్‌కలేమియా యొక్క లక్షణాలు వికారం, బలహీనత, తిమ్మిరి మరియు నెమ్మదిగా హృదయ స్పందన రేటు.

లివర్ కాలేయం మరియు ఇతర అవయవ మాంసాలు ప్యూరిన్‌ల అధిక సాంద్రతలను కలిగి ఉంటాయి. చాలా ఎక్కువ ప్యూరిన్ యూరిక్ యాసిడ్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, ఇది మీ కీళ్లలో స్ఫటికాలను ఏర్పరుస్తుంది లేదా మూత్రపిండాల్లో రాళ్లుగా స్థిరపడుతుంది.

# చలికాలంలో కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే తినాల్సిన టాప్ ఫుడ్స్!



చలికాలంలో కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే తినాల్సిన టాప్ ఫుడ్స్ ఉన్నాయి. అందంగా కనపడాలంటే కేవలం ముఖం మాత్రమే అందంగా ఉంటే సరిపోదు.. అందమైన కళ్ళు కూడా ఉండాలి. అయితే, చలికాలంలో చర్మ సమస్యలతో పాటు కంటి సమస్యలు కూడా అధికంగా వస్తుంటాయి. దీంతో ఇతర కాలాలతో పోలిస్తే శీతాకాలంలో మీ కళ్ళ పట్ల ఎక్కువ శ్రద్ధ చూపాల్సి ఉంటుంది.

ఆరోగ్యకరమైన ఆహారం మనల్ని ఆరోగ్యవంతంగా జీవించేలా చేస్తుందనేది అందరికీ తెలిసిన విషయమే. సమతుల్య పోషకాహారం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి మన శరీరాన్ని మరియు మనస్సును దృఢంగా ఉంచుతాయి. ఇవి మన కళ్లను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

ప్రస్తుతం చాలా మంది కంటి సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చూపు మందగించడం, కళ్లు పొడిబారడం, శుక్లాలు, కంటిచూపు లోపం వంటి కొన్ని ఇతర కంటి సంబంధిత సమస్యలతో బాధపడేవారు. ఒకవైపు విపరీతమైన ఒత్తిడి, మార్కెట్ లో కొత్త సాంకేతిక పరికరాలకు అలవాటు పడడం వల్ల కంటి సమస్యలు తలెత్తుతాయి. మరోవైపు, సీజనల్ కంటి వ్యాధులు లేదా బయటి గాలిలో కాలుష్య కారకాలు కంటి సమస్యలను కలిగిస్తాయి.

కళ్లు పొడిబారడం అత్యంత సాధారణ కంటి వ్యాధులలో ఒకటి పొడి కన్ను. కళ్ళు తగినంత కన్నీళ్లను ఉత్పత్తి చేయకపోతే, మరియు కళ్ళు అవసరమైన మొత్తంలో రాపిడిని కలిగి ఉండకపోతే, పొడి కళ్ళు సమస్య ఏర్పడుతుంది. కన్నీళ్లలో వేడి మొత్తం కూడా పొడి కంటి సమస్యకు దోహదం చేస్తుంది. తక్కువ తేమ, చల్లని ఉష్ణోగ్రతలు మరియు అధిక గాలులు కళ్లను కొంత సమయం పాటు బాగా చూసుకునే వారికి కూడా పొడి కంటి సమస్యలను కలిగిస్తాయి. కాబట్టి చలికాలంలో కళ్లను మరింత మెరుగ్గా కాపాడుకోవడానికి కంటి సంరక్షణ నిపుణులు అనేక సలహాలు ఇస్తున్నారు. సాధారణంగా చలికాలంలో కళ్లను బాగా సంరక్షించేందుకు వైద్యులు కళ్లలో ఐ డ్రాప్స్‌ను సూచిస్తారు. అయితే, కంటి సంరక్షణలో పౌష్టికాహారం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి, ఇక్కడ 5 ముఖ్యమైన సీజనల్ ఫుడ్స్ ఉన్నాయి, ఇవి శీతాకాలంలో మీ కళ్లుపొడిబారకుండా చేసి, కళ్లకు రక్షణ కల్పిస్తాయి.

ఉసిరికాయ ఉసిరికాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది మన శరీరం యొక్క మొత్తం ఆరోగ్యానికి సహాయపడుతుంది. గూస్బెర్రీ ముఖ్యంగా మన శరీరంలోని బంధన కణజాలాలు మరియు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచడం ద్వారా రెటీనా సమస్యలను తగ్గిస్తుంది.

కమలా పండు నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది మన కళ్లపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. మరియు నారింజ పండ్లలో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల మన కళ్లలో ఒళ్లు ఎక్కువగా పడి కళ్ల పొడిబారడాన్ని తగ్గిస్తుంది.

జామ పండు చలికాలంలో అత్యంత సులభంగా లభించే పండు జామ. జామ పండులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి చలికాలంలో జామ పండు తింటే అది మన కంటి చూపును మెరుగుపరుస్తుంది మరియు వృద్ధాప్యంలో కంటి సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది.

స్వీట్ పొటాటోలో విటమిన్ ఎ మరియు బీటా కెరోటిన్ ఉంటాయి. ఈ పోషకాలు కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరుస్తుంది. విటమిన్ ఎ పొడి కంటి సమస్యలను తగ్గిస్తుంది.

పాలకూర కాలే చలికాలంలో తినవలసిన ముఖ్యమైన కూరగాయ. ఈ కూరగాయలలో ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది, ఇది ఆప్టిక్ నరాల నష్టాన్ని నివారిస్తుంది. కాబట్టి నిపుణులు మొత్తం ఆరోగ్యానికి మరియు కంటి ఆరోగ్యానికి పాలకూరను సిఫార్సు చేస్తారు.

## సౌత్ ఈస్టర్న్ రైల్వే పెన్షనర్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న నేషనల్ పెన్షనర్స్ డే నిర్వహణ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఖడగాపూర్ (పశ్చిమ బెంగాల్) సౌత్ ఈస్టర్న్ రైల్వే పెన్షనర్స్ కాంగ్రెస్ అధ్వర్యంలో ఈ నెల 17న ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు! ఈ సమావేశంలో 1000 మందికి పైగా రైల్వే పెన్షనర్లు పాల్గొంటారు. ముఖ్యంగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ (ఫ్యాక్టరీ) మరియు డివిజనల్ రైల్వే మేనేజర్, స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం కింద 75 ఏళ్ల పైబడిన సీనియర్ పెన్షనర్లకు శాలువా కప్పి సర్టిఫికెట్లు ఇచ్చే సంప్రదాయం చాలా రోజులుగా కొనసాగుతుండగా, ఈ ఏడాది కూడా కొందరిని సన్మానిస్తున్నారు!

ఈ సందర్భంగా ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, సౌత్ ఈస్టర్న్ రైల్వే పెన్షనర్స్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీ కెవి రమణారావు జనోదయ న్యూస్ విజన్ హిందీ దినపత్రికకు తెలియజేశారు! ఈ కార్యక్రమం గత 20 సంవత్సరాలుగా నిరంతరం నిర్వహించబడుతోంది మరియు ప్రతి సంవత్సరం రైల్వే అధికారి మరియు స్టేట్ బ్యాంక్ ద్వారా సహాయాన్ని అందిస్తోంది.

## శనివారం నగరంలో జాతీయ పెన్షన్ దినోత్సవం!



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దొండపర్తి పక్కనే ఉన్న శ్రీ కన్యా సినిమా హాల్ ఎదురుగా విశాఖపట్నం నగర్ కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 17న జాతీయ పింఛనుదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 5000 మందికి పైగా పెన్షనర్లు పాల్గొంటున్నారు. దీంతో పాటు 2022-2023 సంవత్సరానికి కొత్త ఆఫీస్ బేరర్ల ఎన్నిక పూర్తవుతుంది. ఈ విషయాన్ని రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేగి నాగేశ్వరరావు తెలిపారు.

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన రెక్టార్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పలు పరీక్ష కేంద్రాలను రెక్టార్ ఆచార్య కె.సమత గురువారం సందర్శించారు. సోషల్ వర్క్ విభాగంలో జరుగుతున్న మూడవ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడం పట్ల అధికారులను అభినందించారు.

## విశాఖలో అయ్యప్ప స్వాముల ఆందోళనతో దిగొచ్చిన రైల్వేశాఖ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): అయ్యప్ప స్వాములు ఆందోళనకు రైల్వే శాఖ అధికారులు దిగొచ్చింది. 47 మంది స్వాముల బృందం ఆగస్టులో కొల్లాపూర్ రైలుకు టికెట్స్ బుక్ చేసుకున్నారు. ప్రయాణ సమయంలో తమకు టికెట్లు కేటాయించిన S7, S8, S9 కంపార్ట్‌మెంట్లు లేకపోవడంతో స్వాముల బృందం షాక్ అయ్యింది. కంపార్ట్‌మెంట్ లేకపోవడంతో ఈ విషయాన్ని స్వాములు రైల్వే శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే శాఖ సిబ్బంది పట్టించకపోవడంతో 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై స్వాములు ఆందోళనకు దిగారు.

## వృద్ధ కళాకారుల పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లాలో గల రంగస్థల వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, 58 సం.లు నిండిన కళాకారులు అర్హులని చెప్పారు. వీరికి ఏ ఇతర పింఛను రాకుండా ఉండాలని, కళాకారునిగా గుర్తింపు పత్రం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జత చేసి వెంటనే జిల్లా కలెక్టరేట్ లో గల సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అదేవిధంగా కళాకారుల గుర్తింపు కార్డులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వీరు రంగస్థల నాటకాలు, బుర్రకథలు తదితర కళారూపాలలో వారికి ఉన్న అనుభవము, వారిచ్చిన ప్రదర్శనల ఫోటోలు ప్రశంసా పత్రాల నకళ్ళు, స్థానికత, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరమైతే కుల ధ్రువీకరణ పత్రాలను జత చేయాలన్నారు.

## ఘనంగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు మనందరి మదిలో చిరస్థాయిగా మిగిలారని జిల్లా కలెక్టర్ డా .ఎ . మల్లిఖార్జున అన్నారు . గురువారం ఉదయం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని ,తన త్యాగాల ఫలితంగా తెలుగు రాష్ట్రం సాధించిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు .భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేషకృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న మహోన్నతుడు అని, ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేసిన మహనీయుడు శ్రీరాములు అని తెలిపారు. ఆయన పేరుతో జిల్లా ఉండటం ఆయన త్యాగాలకు గుర్తుగా నిలుస్తాయన్నారు. అటువంటి మహనీయుడుని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలసిన తరుణమిదని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ .శ్రీనివాస్ మూర్తి, జాయింట్ డైరెక్టర్ , సమాచార శాఖ , వి. మణిరామ్ ,ఇతర జిల్లా అధికారులు , కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి వేడుకలు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం జంక్షన్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం ఘనంగా జరిగాయి. మాజీ శాసనమండలి సభ్యులు అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.భారతదేశ రాజకీయ పటంలో మార్పులు జరగడానికి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి కారణం పొట్టి శ్రీరాములు బలిదానమేనని వారి ఆశయాలను ఆకాంక్షలను ప్రతి ఒక్కరూ భావితరాలకు తెలపాలన్నారు. సమాజం కోసం ప్రాణాన్ని పణంగా పెట్టిన అసమాన అసాధారణ త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని పొట్టి శ్రీరాములు త్యాగఫలంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని అటువంటి మహనీయుడు ఈ దేశానికే ఆదర్శం అని జగదీష్ అన్నారు శ్రీరాములు వంటి కార్యదీక్ష పరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలో స్వాతంత్రం సాధించవచ్చున్నారు నాడు గాంధీజీ. ఈ మాటలు పొట్టి శ్రీరాములు లోని కర్తవ్యపరాయనతకు కార్యదక్షతకు దృఢ సంకల్పానికి నిదర్శనం భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం 58 రోజులు ఏకధాటిగా నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు నాటి పాలకుల నిర్లక్ష్య ధోరణికి ప్రతీకగా నిలిచి ఆత్మార్పణం గావించారన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణకు భగీరధులని నిరాడంబరతకు నిలువెత్తు ప్రతీకాని జగదీష్ అన్నారు ఈ కార్యక్రమంలో సూరే సతీష్ , బోడి వెంకట్రావు ,కుప్పిలి జగన్మోహన్, మళ్ల గణేషు , దూలం ప్రసాద్ , దాడి వీర వెంకట అప్పారావు, కసిరెడ్డి శీను , ఆకుల నానాజీ ,సాలాపు నాయుడు ,కొణతాల బాలకృష్ణ, పెంటకోట వరప్రసాద్ , అండిబోయిన శేషు ,మల్ల శివన్నారాయణ, పిలా శ్యామ్, విల్లూరి రమణబాబు, కాండ్రేగులు సత్యనారాయణ , బుద్ధ విశ్వనాథం ,పెంటకోట శివరాం తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ 14 ఏళ్ల లోపు క్రికెట్ జట్టు కు ఎంపికైన క్రీడాకారుల అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు నగదు పారితోషకాలతో పాటు గుర్తింపు పొందిన ధృపత్రాలను కూడా అందజేస్తున్నారన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత కూడా ప్రభుత్వం ఇస్తోందన్నారు. క్రీడల్లో అనకాపల్లికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపుని తీసుకురావడానికి అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పదోన్నతి పొందిన స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఏ శేఖర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు కేఎం నాయుడు, చీఫ్ సెలెక్టర్ ఎన్ ఎస్ జి వర్మలను సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత కేఎన్వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గైపూరి రాజు, ఆళ్ల నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మోటూరు వెంకట నాగేశ్వరరావు, ఉదయ భాస్కర్, పివి నాయుడు, వెంకట్రావు, రమేష్, కృష్ణాజీ, వీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఏ ఐ టి యు సి 42వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): కేరళ రాష్ట్రంలోని అల్ పూజలో జాతీయ మహాసభలు ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు జరుగు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు పైన భవిష్యత్ కార్యాచరణ జరుగుతుందని కేంద్రంలో నరేంద్ర మోడీ, ఆదానీ అంబానీ లాంటి బహుళ జాతి సంస్థలకు సుమారు పది లక్షల కోట్ల రూపాయలు రుణాలు రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు .నేడు దేశంలో సామాన్య మధ్యతరగతి ప్రజలు బతికి బట్ట కట్టే పరిస్థితి లేదని నిత్యవసర వస్తువులు ఆకాశాన్ని అందుతూ కార్మిక వర్గం మొత్తం తీవ్ర ఆందోళన చెందుతుందని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల్ని రద్దుచేసి కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని అంతేకాకుండా కార్మికులు రైతులు సామాన్య మధ్యతరగతి ప్రజలు పై భారాలు మోపటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం రానున్న కాలంలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు .జాతీయ మహాసభల్లో భవిష్యత్తు కార్యక్రమం రూపొందించడం జరుగుతుందని రానున్న కాలంలో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలు కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలోజిల్లా కో. కన్వీనర్ ఎల్. వి. రమణ,లోవరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించడమే గడప గడపకుఉద్దేశం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో పాటుపడతామని అంతర్గత డ్రైనేజ్ వ్యవస్థను పుర్తి స్థాయిలో మెరుగు పరచాలని అధికారులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు.

కోటపాడు (మం) దీక్షితుల అగ్రహారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ఆయన గ్రామస్థులను పలకరించారు. గ్రామస్థుల నీటి అవసరాల నిమిత్తం 29 లక్షల రూపాయలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశామని తెలిపారు.

పిండ్రంగి రెవెన్యూ పంచాయతీలో ఉన్న దీక్షితులు పాలెం గ్రామం ఆ గ్రామస్థుల కోరిక మేరకు దీక్షితుల అగ్రహారం రెవెన్యూ గ్రామం లో చేర్చలాని గ్రామస్తులు మంత్రి కి విజ్ఞాపన చేశారు. ప్రజల కోరిక మేరకు గ్రామపంచాయతీ నుండి దీక్షిత అగ్రహారం పంచాయతీలోకి చేర్చడానికి మంత్రి ఆమోదం తెలపడం జరిగింది.

## పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో దేశసేవ చేయాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాల స్ఫూర్తితో రాష్ట్రానికి దేశానికి మన వంతు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. స్వర్గీయ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జ్యోతి వెలిగించి, పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్యానికి, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు 56 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారన్నారు. తెలుగు రాష్ట్రం కోసం త్యాగం చేశారని, వారి ప్రేరణతో మనం కూడా రాష్ట్రానికి దేశానికి ఉపయోగపడేలా ఏ రంగంలోనైనా సేవ చేయాలన్నారు. ఆయన స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని, హరిజనోర్ధనకు పాటుపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కే.రాజేశ్వరి ప్రసంగించారు. ఏబిసిడబ్ల్యూఓలు కే.సురేష్, నాగేశ్వరరావు, నరసింహమూర్తి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరజీవి కి ఘన నివాళులర్పించిన మందపాటి దంపతులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి కోసం చేసిన ప్రాణత్యాగం, నిస్వార్థ సేవలను జాతి ఎన్నటికీ మరవకూడదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, 82 వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 70 వ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి రామచంద్ర థియేటర్ కూడలి లో ఉన్న ఆయన విగ్రహానికి మందపాటి దంపతులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుజాతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ప్రాణ త్యాగంతోనే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ పార్టీ కార్యదర్శి గైపూరి రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలక సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లు త్రినాథ్, కోన ఉమ, చవితిన నూకరాజు, కాండ్రేగుల శ్రీనివాసరావు, పలకా వాసు, కట్టమూరి బాబి, సింగంపల్లి నాగరాజు, పిల్లా నరసింహరాజు, నిమ్మకాయల సుధాకర్, పేలూరి కళ్యాణ్, డొంక సత్తిబాబు, ఈదలపాక శివ, ఈదలపాక గోవింద్, డీబీపీపీ రాజు, ఉమాశంకర్, ఈద టింకూ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న ఇల్లు తథ్యం : తిప్పల వంశి రెడ్డి



గాజువాక, (విశాఖ సమాచారమ్): అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న ఇల్లు ఇవ్వడం జరుగుతుందని 74 వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74 వ వార్డు పరిధి నెహ్రూ నగర్ సచివాలయ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు రెండో విడత పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆ వార్డు కార్పొరేటర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని ఆయన చేతులమీదుగా అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సంధర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మూడున్నర ఏళ్ల పరిపాలనలో రాష్ట్ర ప్రజలందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉన్నారని అన్నారు. నవరత్నాల పథకాలలో భాగంగా రాష్ట్రంలో సొంత ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న ఇల్లు నిర్మాణం చేసి అందించడం జరుగుతుందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అందించే అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సక్రమంగా చేరతాయని చెప్పేరు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కలిగి ఉండాలన్నదే జగన్ మోహన్ రెడ్డి యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ 2 జోన్ - 6 ఎడ్మిన్ స్వరాజ్, సచివాలయ, వాలంటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ బోర్డ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సమావేశం



సైనిక్ స్కూల్ కోరుకొండ యొక్క 133వ లోకల్ బోర్డ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మీటింగ్ పాఠశాలలో 15 డిసెంబర్ 2022 గురువారం జరిగింది. వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా, AVSM, YSM, VSM, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, తూర్పు నావికాదళం బోర్డు సమావేశానికి అధ్యక్షత వహించేందుకు కమాండ్ మరియు చైర్మన్ LBA పాఠశాలను సందర్శించారు. అడ్మిరల్‌ను ప్యాలెస్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ కల్నల్ అరుణ్ ఎం కులకర్ణి అందుకున్నారు.

రాగానే అడ్మిరల్ వార్ మెమోరియల్ వద్ద యుద్ధ వీరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు మరియు పాఠశాల సీనియర్ డివిజన్ క్యాడెట్‌లు అందించిన స్మార్ట్ మరియు చాలా కలర్ ఫుల్ గార్డ్ ఆఫ్ ఆనర్‌ను పరిశీలించారు.

తదనంతరం అడ్మిరల్ సింగ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశానికి గౌరవనీయులైన పార్లమెంటు సభ్యుడు, లెఫ్టినెంట్ జనరల్ K సురేంద్ర నాథ్, PVSM, AVSM VSM (రిటైర్డ్), సభ్యుడు (ఓల్డ్ బాయ్స్ అసోసియేషన్) బి చంద్ర శేఖర రావు హాజరయ్యారు. షంషేర్ సింగ్ రావత్, IAS, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన ఆర్థిక కార్యదర్శి, S సురేష్ కుమార్, IAS పాఠశాల విద్యా కమిషనర్, A సూర్య కుమారి, JAS జిల్లా కలెక్టర్, ప్రొఫెసర్ V కృష్ణ మోహన్ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం, V దుర్గా ప్రసాద్ ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, M. సీతా రామరాజు, పేరెంట్ మెంబర్, M శామ్యూల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, APEWIDC, V K విజయ సీనియర్ ఇంజనీర్ (R&B)

సమావేశంలో గత LBA మీటింగ్ నుండి పాఠశాల సాధించిన పురోగతి మరియు కార్యకలాపాల గురించి బోర్డు సభ్యులకు తెలియజేయడం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు తన మెంబర్ సెక్రటరీ రిపోర్ట్‌లో, అన్ని రంగాలలో స్టేక్‌హోల్డర్ల సహకారంతో స్కూల్ స్థిరంగా బాగా రాణిస్తోందని హైలైట్ చేశారు. పాఠశాల చేపట్టిన అన్ని ప్రాజెక్టులు మరియు వాటి స్థితిగతుల గురించి కూడా ప్రిన్సిపాల్ బోర్డుకు తెలియజేశారు. ఇంకా, పాఠశాల పనితీరు సర్వతోముఖంగా మెరుగుపడటం పట్ల ఛైర్మన్ మరియు సభ్యులు సంతోషం మరియు సంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది అందరి నిరంతర కృషితో పాఠశాల మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని తాను కోరుకుంటున్నట్లు ఛైర్మన్ తెలిపారు. అడ్మిరల్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు మరియు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలకు అందిస్తున్న సహాయాన్ని అభినందించారు మరియు ఈ మద్దతు పాఠశాల పురోగతికి వెన్నెముక అని అన్నారు.

# మహిళా క్రికెటర్ ఎం.డి షబ్‌నమ్‌కు కలెక్టర్ అభినందన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారత అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు విశాఖ జిల్లా నుండి ఎంపికైన Md.షబ్నమ్కు విశాఖపట్నం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అభినందనలు తెలిపారు. విశాఖ జిల్లా ,మద్రిపాలెం ప్రాంతానికి చెందిన Md.షబ్నమ్ న్యూజిలాండ్ తో ఐదు టి20 మ్యాచ్లు ఆడనున్న ప్రపంచకప్లో విశాఖపట్నం జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నందున కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు.

గురువారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వర్డ్ కప్కు ఎంపికైన Md. షబ్నమ్కు CSR కింద ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ స్పాన్సర్ చేసిన రూ.50,000/- విలువ కలిగిన "బేటీ పఢావో" కింద జిల్లా కలెక్టర్ వస్తైమ్ స్కాలర్షిప్పు VDCA వైస్ ప్రెసిడెంట్ మరియు AMNS వైజాగ్ అసెట్ హెడ్ D.S.వర్మ సమక్షంలో అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలు క్రికెట్లో రాణించేలా వీడీసీఏ ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. Md.షబ్నమ్ను విజయ తీరాలకు చేర్చేందుకు ఆమె తల్లిదండ్రులను ప్రోత్సహించినందుకు ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పార్థ సారథి VDCA సెక్రటరీ, ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ VDCA తదితరులు పాల్గొన్నారు.

# అపోలో హాస్పిటల్‌లో నాలుగేళ్ల చిన్నారి మోకాలికి అరుదైన శస్త్రచికిత్స



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** నగరంలోని హెల్త్ సిటీ ఆవరణలోని అపోలో హాస్పిటల్ నాలుగేళ్ల చిన్నారి మోకాలికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించింది. అవయవ వక్రతను సరిచేసే అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను డాక్టర్. రవిచంద్ర పట్టిపల్లి గత సెప్టెంబర్-2022 నెలలో విజయవంతంగా నిర్వహించారు. శ్రీకాకుళంకు చెందిన 4 సంవత్సరాల పాపకు పుట్టుకతోనే ఎడమ వైపు కాలు వక్రతతో జన్మించటం వలన నడవలేక పోయేది. తల్లితండ్రులు పాపను అనేక హాస్పిటల్స్ నందు చూపించిన ఫలితం లభించలేదు. చివరకు అపోలో ఆస్పత్రిలో వివిధ పరీక్షల అనంతరం.. పాపకు మోకాలు చిప్ప సరియైన స్థితిలో లేదని, వక్రంగా ఉందని గుర్తించారు. ఆర్థోపెడిక్ రంగంలో ఇటువంటి కేసు రావటం ఇదే మొదటిసారికాగా, కేసు క్లిష్టతను గుర్తించిన డాక్టర్ రవిచంద్ర పట్టిపల్లి.. ప్లాస్టిక్ సర్జన్ అయిన డాక్టర్. పి. ఆర్ కె . ప్రసాద్ కలసి పాపకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్సను సెప్టెంబర్ నెలలో నిర్వహించారు. ఇప్పుడు పాప బాగా కోలుకుని ఎలాటి నడక, సాధనాలు సాయం లేకుండా చక్కగా నడవ గలుగుతోంది. ఇటువంటి శస్త్ర చికిత్స నిర్వహించటానికి ముందు అనేక మంది నిపుణులు బృందం కూర్చొని విశ్లేషణ చర్చలు. జరపవలసిన ఆవశ్యకత ఉంటుందని డాక్టర్. రవిచంద్ర పెట్టి పల్లి తెలిపారు. గతంలో జర్మనీలో ఇలాంటి శస్త్ర చికిత్స జరిగిందన్నారు.

# ఫార్మాసిటీలో భూనిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



**పరవాడ, (విశాఖ సమాచారరమ్):** పరవాడ మండలం జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో గల ఫైర్ స్టేషన్లో నియమించే ఉద్యాగాలకు భూ నిర్వాసిత గ్రామాల యువకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే కంపెనీల నియామకాలలో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను తప్పని సరిగా ఫార్మా కంపెనీలు పాటించాలని వైకాపా మాజీ మండల అధ్యక్షులు బొడ్డపు చిన్నారావు అన్నారు. ఫార్మా కంపెనీలు విడుదల చేసే కాలుష్యం వలన క్యాన్సర్, కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులతో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, పొల్యూషన్ బోర్డు తగు చర్యలు తీసుకొని ప్రజల జీవన ప్రమాణాలతో ఆటలాడుతున్న కంపెనీలపై కట్టుదిట్టమైన ఆంక్షలు విధించాలని,ఫార్మా కంపెనీల రసాయన వ్యర్థాలను ట్రీట్మెంట్ ప్లాంటుకు పంపించడం లేదా పైప్ లైన్ ద్వారా సముద్రంలోకి పంపించకుండా ఇంకుడు గుంతలు వాడడం వలన, భూగర్భ జలాలు కలుషితమై చుట్టు ప్రక్కల ప్రజలు మంచినీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఫార్మా గ్రీన్ బెల్ట్ నిమిత్తం తీసుకొన్న భూమిలో నిబంధనలు అనుసరించి మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలి కానీ ఫార్మా కంపెనీలు తమ తమ రసాయనాల వ్యర్థాలను వర్షాలు పడుతున్నప్పుడు పైప్ లైన్ల ద్వారా వర్షపు నీరు ప్రవహించే గెడ్డ వాగుల్లో వదలడం వలన అవి చెరువులకు చేరి, చెరువులలో ఉన్న మత్స్య సంపద నాశనం అవడంతో పాటు, ఆయకట్టుదారులు వ్యవసాయం చెయ్యడానికి ఆ నీటి ద్వారా వచ్చే దుర్గంధంతో రైతులు నానా అవస్థలు పడుతూ అనారోగ్య ఫాలో అవుతున్నారని అన్నారు. ఈ విషయమై పలు దఫాలు రాంకీ యాజమాన్యానికి, పెందుర్తి శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ దృష్టికి తీసుకెళ్లిన నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. ఎమ్మెల్యే అదీప్ అనుచరుడైన తానాం గ్రామానికి చెందిన ఒక కాంట్రాక్టర్ మెజారిటీ ఫార్మా కంపెనీలలో కాంట్రాక్టర్, మాన్ పవర్ సప్లై చేస్తుండడంతో కంపెనీలపై ఆయన గుత్తాధిపద్యం చెలాయిస్తూ స్థానికులకు కాకుండా బయట వ్యక్తులకు 2 లక్షలు తీసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తున్నారని అన్నారు. ఈయనకు చెందిన 2 మాక్స్ ఎంటర్ ప్రైజెస్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ. అమలుచెయ్యాలని డిమాండ్ చేశారు. పొల్యూషన్ బోర్డు ఇకనైనా మేల్కొని కాలుష్య కారకాలుగా ఉన్న ఫార్మా కంపెనీలపై తగు చర్యలు తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా ఉండే కంపెనీలను మూసివేసి ప్రజల జీవన ప్రమాణాలు పెంపెందించడానికి తగు చర్యలు తీసుకోవలసిందిగా, ఈ విషయంలో జాప్యానికి తావు లేకుండా చర్యలకు ఉపక్రమించాలని, లేనిచో రానున్న రోజులలో రాంకీ ఫార్మా కంపెనీలపై పార్టీలకు అతీతంగా ఆందోళనలు, ధర్నాలకు ఉపక్రమించవలసి ఉంటుందని మాజీ మండల వైకాపా అధ్యక్షులు బొడ్డపు చిన్నారావు హెచ్చరించారు.

# భీముని గుమ్మం చాముండేశ్వరిని దర్శించుకున్న ఎం.వి. ఆర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక భీముని గుమ్మంలో గత కొన్ని సంవత్సరాలుగా నవశక్తి మందిరం లో పూజ లు అందుకుంటున్న భవాని మందిరంలో చాముండి హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా ప్రముఖ పారిశ్రామికవేత్త, ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు సంజయ్ లు విచ్చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సాధరం గా ఆహ్వానించారు. మందిరానికి వెళ్లే ముందుగా చాముండేశ్వరి విగ్రహాన్ని ఎంవిఆర్ తలపై పెట్టుకుని భవాని భక్త బృందంతో ఆలయానికి వచ్చారు. జై భవాని జై జై భవాని అంటూ భక్తుల శరణు ఘోషతో మందిరానికి తీసుకుని వెళ్లారు. అక్కడ అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరరావు సంజయ్ లను ఆలయ కమిటీ సభ్యులు సాలువాలు కప్పి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మందిరం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ, ఎం.వి.ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.




# మూడు రాష్ట్ర రహదారులను నేషనల్ హైవే కు అనుసంధానంగా అనుమతులు ఇవ్వండి...వంగా గీతావిశ్వనాథ్



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఢిల్లీలో కేంద్ర రహదారులు, రవాణా శాఖ మాత్యులు శ్రీ నితిన్ గడ్కరీ గారిని కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ గారు మర్యాదపూర్వకంగా కలిసి కాకినాడ పార్లమెంటు పరిధిలో సాగర్ మాల ప్రాజెక్టు కింద రూ. 2,300 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు ప్రజలు తరపున ధన్యవాదములు తెలిపి ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజల తరపున కోరడమైనది, ప్రమాదాలు నివారించుటకు కాకినాడ పార్లమెంట్ పరిధిలో జాతీయ రహదారిలో ఉన్న 13 ప్రధాన కూడలిలు ముఖ్యంగా పిఠాపురం గొల్లప్రోలు చందుర్తి తాటిపర్తి వన్నీపూడి కూడలిలు వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరడమైనది, జాతీయ రహదారి చేపూరు,గవరయ్య కోనేరు గ్రామాల వద్ద సర్వీసు రోడ్డు మార్గమునకు గతంలో అంచనాలను ఇవ్వడమైనది, ప్రజల అవసరాల రీత్యా ఈ సర్వీస్ మార్గములను యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని కోరడమైనది, 1,సామర్లకోట వేమగిరి మధ్య ఉన్న కెనాల్ రోడ్డును నేషనల్ హైవే రోడ్డు కింద మార్పు చేస్తూ వేమగిరి వద్ద,,2. కాకినాడ నుండి కోటిపల్లి మీదుగా అమలాపురం మరియు 3. కాకినాడ నుండి మండపేట మీదుగా జొన్నడ వద్ద నేషనల్ హైవే కు అనుసంధాన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ,అభివృద్ధి చేయాలని కోరడమైనది.

## పొట్టి శ్రీరాములు వర్ధంతికి నివాళులు అర్పించిన డీటీసీ రాజా రత్నం



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర రాష్ట్ర సాధకులు స్వర్గీయ పొట్టి శ్రీరాములు గారు వర్ధంతిని పురస్కరించుకుని ఉప రవాణా కమీషనరు మరియు ఇతర రవాణా శాఖ అధికారులు సహా సిబ్బందితో కలసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ జి. సి. రాజారత్నం గారు మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు యొక్క త్యాగ నిరతిని కొనియాడారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.